జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967



కృష్ణ | ఆదివారం 27 సెప్టెంబర్ 2026 | సంపుటి : 01 | సంచిక :254 | పేజీలు : 12 | వెల : 3/- | PRGI No. APTEL/26/A0119,

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయణం సూర్యోదయం: 5.42 । సూర్యాస్తమయం: 6.22 చంద్రోదయం: 4.57 । చంద్రాస్తమయం: 5.20 తిథి: బహుళ చతుర్దశి రా. 1.37 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: పుష్యమి సా. 10.23 వరకు, తదుపరి ఆశ్లేష యోగం: సిద్ధి రా. 8.18 వరకు, తదుపరి వ్యతీపాత కరణం: భద్ర మ. 2.45 వరకు, తదుపరి శకుని రా. 1.37 వరకు, తదుపరి చతుష్పాద

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com


## ఈసీ ప్రకటనతో అపోహలకు

# తెరపడింది

- ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలంటూ ప్రచారం
- ఢిల్లీలో కీలక సమావేశంతో క్లారిటీ ఇచ్చిన ఈసీ
- తమ మధ్య విభేదాలు లేవంటూ సంయుక్త ప్రకటన విడుదల
- సోషల్ మీడియాలో స్పందించిన ఏపీ సీఎం చంద్రబాబు
- రాజ్యాంగ సంస్థల సమగ్రతను, విశ్వసనీయతను గౌరవించాలని పిలుపు
- గెలుపోటములను హుందాగా స్వీకరించడమే నాయకత్వ లక్షణమని ఉద్ఘాటన



**అమరావతి**

భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)లో కమిషనర్ల మధ్య విభేదాలు తలెత్తాయంటూ వచ్చిన వార్తలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. ఇవాళ ఓ కీలక సమావేశం సందర్భంగా ఈసీ ఇచ్చిన ఏకగ్రీవ ప్రకటనతో అన్ని అపోహలకు తెరపడిందని ఆయన పేర్కొన్నరు. మన రాజ్యాంగ సంస్థల సమగ్రతను, విశ్వసనీయతను ఈ ప్రకటన మరోసారి స్పష్టం చేసిందని ఎక్స్ వేదికగా శనివారం ఆయన పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై నెలకొన్న వివాదం తాజాగా ఈసీ వివరణతో ముగిసిందని తెలిపారు. స్వల్పకాలిక రాజకీయ ప్రయోజనాల కోసం భారత ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియలపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు చేయడం దురదృష్టకరమని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఎన్నికల ఫలితాలు ప్రజల తీర్పును ప్రతిబింబిస్తాయని, - మిగతా3లో



## గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేలో

# ట్విన్ టన్నెల్స్

- 2 అడుగుల వెడల్పు - 32 అడుగుల ఎత్తు
- విజయవాడ-కడప-బెంగుళూరు ఎకనామిక్ కారిడార్‌ను కలుపుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లా మీదుగా నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే పనులు జెట్‌స్పీడ్‌లో జరుగుతున్నాయి
- ఇలాంటి అద్భుతమైన గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేలో ట్విన్ టన్నెల్స్ మరో వండర్.

**అమరావతి**

విజయవాడ-కడప-బెంగుళూరు ఎకనామిక్ కారిడార్‌ను కలుపుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లా మీదుగా నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే పనులు జెట్‌స్పీడ్‌లో జరుగుతున్నాయి. ఇలాంటి అద్భుతమైన గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేలో ట్విన్ టన్నెల్స్ మరో వండర్. - మిగతా3లో



## ఫారం-6లో చట్ట, రాజ్యాంగ

# విరుద్ధమైన మార్పులు

- సీఈసీ ఉద్దేశపూర్వకంగానే ఇలా చేశారు
- సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై కాంగ్రెస్ ఆగ్రహం
- ఫారం 6లో ఆయన చట్ట, రాజ్యాంగ విరుద్ధమైన మార్పులు చేశారని మండిపాటు
- ఓటరు నమోదు ప్రక్రియలో ఈసీ చేసిన మార్పులతో జెన్‌జీ ఓటర్లకు ఆటంకాలు ఏర్పడ్డాయని ఆరోపణలు

# నాగాలాండ్‌లో కల్తీ మద్యం కలకలం..

రెండు రోజుల్లో 19 మంది మృతి

ఘటనపై సిట్ దర్యాప్తు ప్రారంభం

మద్యం నమూనాలు ఫోరెన్సిక్ పరీక్షలకు తరలింపు

19 మందిని అరెస్టు చేసిన పోలీసులు

దాదాపు 3 వేల బాటిళ్ల స్వాధీనం

అనుమానిత మద్యం సేవించొద్దని పోలీసుల హెచ్చరిక





## 'సర్' నోటీసులు.. అత్యవసరమైతే తప్ప వ్యక్తిగత విచారణకు రానక్కర్లేదు

- నోటీసులు అందుకున్నవారు బీఎల్‌వోను కలవక్కర్లేదు.. బీఎల్‌వోలే ఓటర్లక ఇళ్లకు వస్తారు
- రాత్రి షెల్టర్లు, కార్మికులు, పేదలు, నిరాశ్రయుల కోసం డీఈవోలు సహాయ కేంద్రాలు, స్పెషల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి
- ఎస్ఐఆర్ కాకుండా ఇతర సమయాల్లో సాధారణ నియమాల ప్రకారం ఫామ్‌లు వాడాలి
- ఈసీఐనెట్‌ను సీనియర్ డీఈసీ అధ్యక్షతన కమిటీ సమీక్షిస్తుంది
- ఎస్ఐఆర్ 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పూర్తయింది
- ఓటర్లు, యువకులు కంటిన్యుయస్ అప్‌డేషన్ ద్వారా పేరు చేర్చుకోవచ్చు

## పరవాడ ఫార్మా కాలుష్యంపై

# పవన్ కల్యాణ్ సీరియస్



- 95 కంపెనీలకు నోటీసులు
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఫార్మాసిటీపై పీసీబీ చర్యలు
- సోషల్ మీడియా ఫిర్యాదు ఆధారంగా కాలుష్యంపై తనిఖీలు
- పరవాడలోని 95 ఫార్మా పరిశ్రమలకు షోకాజ్ నోటీసులు జారీ
- వ్యర్థాల నిర్వహణపై పరిశ్రమలకు కీలక దిద్దుబాటు చర్యల ఆదేశం

**అమరావతి**


సోషల్ మీడియాలో వచ్చిన ఒక ఫిర్యాదుపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తక్షణమే స్పందించారు. ఆయన ఆదేశాలతో అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలోని 95 పరిశ్రమలకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. శుద్ధి చేయని వ్యర్థాలను వర్షపు నీటి కాలువల్లోకి విడుదల చేస్తూ కాలుష్యానికి కారణమవుతున్నారన్న ఆరోపణలపై ఈ చర్యలు తీసుకుంది. వివరాల్లోకి వెళితే, పరవాడ ఫార్మాసిటీ సమీపంలోని డ్రెయిన్లలో - మిగతా3లో



## పార్లమెంట్‌లో ఎస్సీ, ఎస్టీ ఎంపీలకు మరింత సమయం ఇవ్వండి

- లోక్‌సభ స్పీకర్‌కు జితిన్ రామ్ మాంజీ లేఖ
- సభలో కీలక బిల్లులపై చర్చ జరిగే సమయంలో ఎస్సీ, ఎస్టీలకు అదనపు సమయం ఇవ్వాలన్న మాంజీ
- తమ సామాజిక వర్గానికి తగినంత సమయం అవసరమన్న మాంజీ
- తమ అభ్యర్థనను సీరియస్‌గా పరిగణించాలని విన్నపం

# పేదలకు పట్టాభిషేకం




- ఈ నెల 30న చంద్రబాబు చేతుల మీదుగా పట్టాలు
- ఈ నెల 30న విజయవాడలో ఇళ్ల క్రమబద్ధీకరణ పట్టాల పంపిణీ
- 24,057 కుటుంబాలకు సంపూర్ణ యాజమాన్య హక్కులు
- రూ.9800 కోట్ల విలువైన భూములపై పేదలకు అధికారం
- దశాబ్దాల నాటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన కూటమి ప్రభుత్వం
- 8 నియోజకవర్గాల్లోని లబ్ధిదారులకు ప్రయోజనం

**అమరావతి**

పేదలకు పూర్తిస్థాయి యాజమాన్య హక్కులు కల్పించే బృహత్తర కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వం మరో ప్రతిష్ఠాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టింది. దశాబ్దాలుగా నగరవాసులను వేధిస్తున్న ఇళ్ల పట్టాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కీలక ముందడుగు వేసింది. విశాఖపట్నంలో ఇటీవల విజయవంతంగా నిర్వహించిన 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమ స్ఫూర్తితో, ఇప్పుడు విజయవాడలో భారీ ఎత్తున ఇళ్ల క్రమబద్ధీకరణ పట్టాల పంపిణీకి సిద్ధమైంది. ఈ నెల 30వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా 24,057 కుటుంబాలకు సంపూర్ణ హక్కులతో కూడిన పట్టాలను అందించనున్నారు. విజయవాడలో ప్రతి ఎన్నికల్లోనూ ప్రధాన అజెండాగా మారుతున్న ఇళ్ల పట్టాల సమస్యకు కూటమి సర్కార్ చరమగీతం పాడుతోంది. దశాబ్దాల క్రితం అందించిన ఎన్టీఆర్ పట్టాలకు చట్టబద్ధత - మిగతా3లో

# పండగల సీజన్‌లో బంగారం కొనొద్దు

- ప్రధాని మోదీ విజ్ఞప్తి ఫలిస్తుందా?
- బంగారం కొనుగోళ్లు తగ్గించాలని భారతీయులకు ప్రధాని మోదీ మరోసారి పిలుపు
- విదేశీ మారక ద్రవ్యం ఆదా చేసేందుకే ఈ విజ్ఞప్తి
- పండగల సీజన్‌లో ఈ పిలుపునకు స్పందనపై ఉత్కంఠ
- వినాయక చవితికి 15 శాతం మేర తగ్గిన బంగారం అమ్మకాలు
- పెట్టుబడికి భౌతిక బంగారం కన్నా ఈటీఎఫ్‌లు మేలంటున్న నిపుణులు



## అంగన్వాడి ఉత్సవం మరియు పోషణ మహోత్సవ కార్యక్రమం



**లేపాక్షి: ప్రజా జ్యోతి న్యూస్: సెప్టెంబర్ 26:** శ్రీ సత్య సాయి జిల్లా బ్యూరో అంజి: లేపాక్షి మండలం కల్లూరు గ్రామపంచాయతీలో సీ డి పీ ఎల్ ఆదేశాల మేరకు అంగన్వాడి ఉత్సవం మరియు పోషణ మహోత్సవ లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమంలో సిడిపిఓ వరలక్ష్మి సూపర్వైజర్ సునీత పోషణ మహ్ సేవా సంకల్ప అభియాన్ లో భాగంగా కల్లూరు గ్రామం నందు అంగన్వాడి సెంటర్లో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో లబ్ధిదారులకు అంగన్వాడి సేవలు పోషకాహారం ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు అంగన్వాడి కేంద్రాల ద్వారా చిన్నారులకు గర్భిణీలకు బాలింతలకు తల్లులకు అందుతున్న సేవలను వివరించారు ప్రధానమంత్రి మాతృ వందన యోజన నవచేతన స్క్రీనింగ్ పోషకాహారం బాల్యవివాహాలు నివారణ మహిళ అభివృద్ధి శిశు సంక్షేమ శాఖకు సంబంధించిన నివేద కార్యక్రమాలపై అవగాహన కల్పించారు హెల్త్ లైన్ నెంబర్లు గృహహింస తదితరా అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ సూపర్వైజర్ సునీత వెంకటలక్ష్మి శ్రీనివాస్ రెడ్డి ఏఎన్ఎం అంగన్వాడి కార్యకర్తలు ఆయాలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## బయనపల్లిలో అంగన్‌వాడీ ఉత్సవం



**చెన్నూరు, సెప్టెంబరు 26:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 76వ జన్మదినాన్ని పురస్కరించుకుని చేపట్టిన సేవా సంకల్ప్ అభియాన్లో భాగంగా చెన్నూరు మండలం బయనపల్లిలో అంగన్‌వాడీ ఉత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. బయనపల్లి-1, బయనపల్లి-5 అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన కార్యక్రమంలో కమలాపురం అంగన్‌వాడీ ఉత్సవ ఇన్‌చార్జి, కడప జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు సంఘట రామ్మోహన్‌రెడ్డి, చెన్నూరు మండల బీజేపీ అధ్యక్షుడు పి. వెంకటరామిరెడ్డి, ఐసీడీఎస్ సీడీపీవో గుర్రమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు, వాటి ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం గర్భిణులు, బాలింతలను సన్మానించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం. రామలచ్చమ్మ, టి. రమాదేవి, ఆయాలు, ఆశా వర్కర్లు, మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, టీడీపీ కార్యకర్తలు, గ్రామ మహిళలు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రాలు సేవలను సద్వినియోగం చేసుకోవాలి.



**పాలకొల్లు. ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం సెప్టెంబర్ 27.** అంగన్వాడీ కేంద్రాలలో ప్రభుత్వం అమలు చేస్తున్న సేవా పథకాలను అర్హులైన లబ్ధి దారులందరూ సద్విని యోగం చేసుకోవాలని మండల. బిజెపి అధ్యక్షుడు చింతపల్లి రమేష్ శెట్టి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 25 సంవత్సరాల ప్రజాసేవ సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్పం కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్రాలలో నిర్వహిస్తున్న ఉత్సవాలలో భాగంగా సిడిపిఓ ఇందిర ఆదేశాల మేరకు శనివారం జిన్నూరు కొత్తపేట భూపయ్య చెరువు కేంద్రాలలో జరిపారు. ఈ కార్యక్రమంలో రమేష్ శెట్టి మాట్లాడుతూ కుటుంబంలో ఒక మహిళ ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం ఆరోగ్యంగా ఉంటుంది ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పై శ్రద్ధ వహించి పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. అంగన్వాడి సూపర్వైజర్ కె మోహనరాణి మాట్లాడుతూ గర్భవతులు పిల్లలు సకాలంలో వ్యాధినిరోధక టీకాలు వేయించుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలకు బాలింతలకు ఇచ్చే పౌష్టికాహారం నాణ్యత వారు తీసుకోవలసిన జాగ్రత్తలు ఆమె వివరించారు. అంగన్వాడీ కేంద్రాలలో ప్రీస్కూల్ పిల్లలకు ఆటపాటల ద్వారా విద్య నేర్పించడం జరుగుతున్నదన్నారు. కూటమి నాయకులు ఆరోగ్య సిబ్బంది జ్యోతి అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజు గారి దివాణంలో వినాయక చవితి ఉత్సవ కమిటీవారికి రూ.5 వేలు విరాళం ఇచ్చిన డాక్టర్ చల్లా, గౌతు నాగు ముద్దుల మనవడు జస్విక్ ప్రణయ్.



**ఆలమూరు సెప్టెంబర్ 26(ప్రజాజ్యోతి) :** గణపతి నవరాత్రుల సందర్భంగా మండల కేంద్రం ఆలమూరులోని రాజు గారి దివాణంలో వినాయక చవితి ఉత్సవ కమిటీవారికి ఉత్సవాల అనంతరం జరిగే అన్నసమారాధనకు రూ. 5 వేలు విరాళం ఇచ్చిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐక్య కాపునాడు ట్రెజరర్,డాక్టర్ బిఆర్అంబేద్కర్ కోనసీమ జిల్లా కాపు సంఘం అధ్యక్షులు,ప్రముఖ వ్యాపారవేత్త, జాతీయ సేవా పురస్కార్ అవార్డు గ్రహీత డాక్టర్ చల్లా ప్రభాకర్ రావు, గౌతు సుబ్రహ్మణ్యం(నాగు)ముద్దుల మనవడు జస్విక్ ప్రణయ్.ఈ కార్యక్రమంలో జి సూర్య నారాయణ,ఎస్ సతీష్,ఎస్ దుర్గారావు,డి వాసు,ఎల్ కార్తీక్,బి శ్యామ్,కె దేవ,వై యశ్వంత్,పి వెంకన్న,ఎం శేషు,సిహెచ్ శివశంకర్,ఎం భవానిశంకర్,ఎన్ రామ్ చరణ్,వి హరి,ఎస్ ధనుష్,ఎం శ్యామ్,ఎస్ సాయి,ఎల్ కార్తీక్,ఎల్ సందీప్,ఎస్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## రౌతులపూడి, శంఖవరం మండలాల సమస్యగా బైపాస్ రోడ్డునభావించాలి

**-రిలే దీక్షకు సంఘీభావం : చిలుకూరి రాంకుమార్**



**శంఖవరం: సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి న్యూస్)** ప్రత్తిపాడు నియోజక వర్గం లో శంఖవరం, రౌతులపూడి, మండలాల్లో మైనింగ్ లారీల వలన రోడ్లు దెబ్బతినే సమస్య గత ప్రభుత్వం హయాం నుంచే ఉందని కాకినాడ జిల్లా పూర్వ అధ్యక్షులు, ఏలూరు జిల్లా ఇంచార్జి చిలుకూరి రాంకుమార్ అన్నారు.పరిశ్రమల అవసరాల దృష్ట్యా ఈ మైనింగ్ ను ఉపయోగించడం జరుగుతుందని, ఇప్పుడు శంఖవరం గ్రామంలో రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా శంఖవరం అభివృద్ధి సేవా సంఘం ప్రజా శ్రేయస్సు దృష్ట్యా రిలే నిరాహార దీక్ష చేపట్టడం జరిగిందని, దానికి తాము సంఘీభావం తెలపడం జరిగిందని అన్నారు.ఈ సమస్యను పక్క దారి పట్టించవద్దని, దయచేసి ప్రజలందరూ ఈ సమస్యను రౌతులపూడి శంఖవరం మండలాల సమస్యగా భావించి, దీనిని శాంతియుతంగా పరిష్కరించుకోవడంలో అందరం ఒకటిగా కలవాలని పిలుపునిచ్చారు.కలిసి ఈ బైపాస్ రోడ్డు యొక్క తీర్మానాన్ని, ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్దామని, ఇప్పటికే అధికారులు దీనిపై సమీక్ష నిర్వహించినట్లు తెలిసిందని, అది త్వరలోనే అభివృద్ధికి పునాది రాయి పడాలని కోరుకుంటున్నామని అన్నారు.29వ తేదీ వరకు సాగే ఈ రిలే నిరాహార దీక్ష శాంతియుతంగా కొనసాగాలని, దానికి సంకేతంగా ప్రజలు ముందుకు వచ్చి సంఘీభావం తెలపాలని కోరారు. తమ విన్నపాలను తమ నాయకత్వానికి కూడా తెలియజేయడం జరిగిందని చిలుకూరు రామకుమార్ తెలిపారు.

## 11వ రోజుకు చేరిన వీఆర్ఏల నిరసన




**గుంతకల్లు సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి):** వీఆర్ఏ ల సమస్యలను ప్రభుత్వం పరిష్కారం చేయాలని కోరుతూ స్థానిక తాసిల్దార్ కార్యాలయం ఆవరణలో గుంతకల్లు మండలం కు చెందిన వీఆర్ఏ లు చేపట్టిన నిరసన కార్యక్రమం శనివారంతో 11వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వీఆర్ఏ లు మాట్లాడుతూ తమ ప్రధాన సమస్యలైన జీతభత్యాల పెంపు, పే స్కేల్ అమలు, పదోన్నతులు, నామినేషన్ ద్వారా వీఆర్ఏల నియామకం తదితర సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏలు రామాంజనేయులు, మస్తానయ్య, శీవప్ప, హరి ప్రసాద్, సురేష్, రాజు, అరుణ్, నాగరాజు, శ్రీనివాసులు, రమేష్ పాల్గొన్నారు.

## జాతీయ రహదారి ప్రక్కన చొప్పెల్ల లో శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామివారి భారీ విగ్రహ నిర్మాణం.




**ఆలమూరు సెప్టెంబర్ 26(ప్రజాజ్యోతి):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామం శ్రీ కొండాలమ్మవారి గుడి సెంటర్లో జాతీయ రహదారి(నేషనల్ హైవే)పక్కన శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామివారి నూతన భారీ విగ్రహ నిర్మాణం చేయడానికి వాల్మీకి సనాతన ధర్మ పరిరక్షణ సమితి శ్రీకారం చుట్టారు.శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామివారి నూతన విగ్రహ నిర్మాణానికి ఆంజనేయ స్వామివారి భక్తులు, దాతలు, చొప్పెల్ల, చెముడులంక, బడుగువానిలంక, మడికి, మూలస్థాన అగ్రహారం గ్రామాల ప్రజలు, బట్టీ ఓనర్లు,ఆనియన్ బిజినెస్ ఓనర్లు,ఇటుక ట్రాక్టర్స్ ఓనర్లు విరివిగా విరాళాలు ఇచ్చి శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామివారి భారీ విగ్రహ నిర్మాణానికి సహకరించాలని వాల్మీకి సనాతన ధర్మ పరిరక్షణ సమితి కమిటీ సభ్యులు కోరుచున్నారు. ఈ విగ్రహ నిర్మాణం పూర్తయిన తర్వాత భారీ స్థాయిలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఉంటుందని,భారీ అన్న సమారాధన కూడా ఉంటుందని అలాగే విగ్రహ ప్రతిష్ట అనంతరం ప్రతి మంగళవారం శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామివారికి విశేష పూజలు, భక్తులకు పేదలకు అన్నదానం చేయడానికి నిర్ణయించామని విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు తెలియజేశారు.ఈ మహా సంకల్ప కార్యక్రమానికి అందరు సహకరించాలని విరాళాలు ఇచ్చే దాతలు, మరిన్ని వివరాలకు 9912857345 ఫోన్ నెంబర్ కి కాల్ చేయవలసినదిగా విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు కోరుచున్నారు. సర్వేజన:సుఖినోభవంతు, జై శ్రీరామ్.

## పశువుల ఆసుపత్రి ముందు 40 మీటర్ల సీసీ ర్యాంపు నిర్మించాలి

**-- బీజేపీ మండల అధ్యక్షులు బి. గోపాల్**



**సెప్టెంబర్ 26 ప్రజాజ్యోతి న్యూస్ రాయలసీమ ఇంచార్జీ శ్రీనివాస్ నాయుడు :-** కూడేరు మండల పరిధిలోని చోళసముద్రం గ్రామంలో ఉన్న పశువుల ఆసుపత్రి ముందు సుమారు 40 మీటర్ల పొడవున సీసీ ర్యాంపు నిర్మించాలని బీజేపీ మండల అధ్యక్షులు బి. గోపాల్ కోరారు.పశువుల ఆసుపత్రికి వచ్చే రైతులు, పశుపోషకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆసుపత్రి ముందు రహదారి సక్రమంగా లేకపోవడంతో వర్షాకాలంలో బురద, నీరు నిలిచి పశువులను ఆసుపత్రికి తీసుకురావడంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలు, పశుపోషకుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు స్పందించి 40 మీటర్ల సీసీ ర్యాంపును నిర్మించి, ఆసుపత్రికి రాకపోకలు సులభతరం చేయాలని బి. గోపాల్ కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు గోవిందరాజులు,సంజీవ నాయక్.సుధాకర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రాలలో వేడుకగా జరిగిన ఉత్సవం.




**పోడూరు.ప్రజా జ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. సెప్టెంబర్ 26.** ప్రధానమంత్రి నరేంద్రమోడీ పుట్టిన రోజును పురస్కరించుకొని జరుగుతున్న సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమం లో భాగంగా అంగన్వాడీ కేంద్రాలలో జరుపుతున్న ఉత్సవ కార్యక్రమం పోడూరు మండలం జిన్నూరు పాలెం అంగన్వాడీ కేంద్రంలోను, గుమ్ములూరు శివారు పైడావ అంగన్వాడీ కేంద్రంలోనూ జరిపారు. ఈ కార్యక్రమములో కూటమి నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అంగన్వాడీ కేంద్రం నుండి అమలు జరిగే ప్రభుత్వం పథకాలు అంగన్వాడీలో ఇచ్చే పౌష్టికాహారం వివరాలను ఐసిడిఎస్ సూపర్వైజర్ ఉమారాణి, తులసి కూటమి నాయకులకు, లబ్దిదారులకు వివరించారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో ఈ సేవలను అర్హత కలిగినవారు ఉపయోగించు కోవాలని కూటమి నాయకులు సూచించారు. అంగన్వాడి కార్యకర్తలు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా జరిగిన టిడిపి ఆలమూరు మండల అధ్యక్షులు ఈదల సత్తిబాబు జన్మదిన వేడుకలు.



**ఆలమూరు సెప్టెంబర్ 26(ప్రజాజ్యోతి):** తెలుగు దేశం పార్టీ ఆలమూరు మండలం అధ్యక్షులు ఈదల సత్తిబాబు పుట్టినరోజు వేడుకలు శుక్రవారం అత్యంత ఘనంగా జరిగినాయి. మండలంలోని అనేక మంది కూటమి నాయకులు, శ్రేయోభిలాషులు సత్తిబాబు కి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేసారు.ఆలమూరు ఎంపిడిఓ ఏ రాజు ఈదల సత్తిబాబు కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి దుశ్శాలువా కప్పి ఇండోర్ మొక్కను బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఏవో మెహర్ ప్రకాష్ తో పాటు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యకరమైన జీవనశైలికి ఉపయోగపడేలా నూతన పార్కును ఏర్పాటు చేస్తాం

**: గుమ్మనూరు నారాయణ స్వామి**

**కోటి 30 లక్షల రూపాయలతో నూతన పార్కు ఏర్పాటుకు స్థలం పరిశీలన**

**గుంతకల్లు సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి):** పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలికి ఉపయోగపడేలా నూతన పార్కును ఏర్పాటు చేసేం దుకు చర్యలు చేపడుతు న్నట్లు గుంతకల్లు మండల ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణ స్వామి తెలిపారు. శనివారం పట్టణంలోని 2వ వార్డు, కసాపురం రోడ్డు పిరమిడ్ ఏరియాలో నూతన పార్కు ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుమ్మనూరు నారాయణస్వామి పరిశీలించారు. మున్సిపా లిటీ 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా రూ.1 కోటి 30 లక్షలతో నూతన పార్కు ను అభివృద్ధి చేయాలని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆలోచిస్తున్నట్లు నారాయణ స్వామి తెలిపారు. ఈ ప్రాంతంలో డిగ్రీ కళాశాల, పిరమిడ్ ధ్యాన కేంద్రం ఉండటంతో పాటు ప్రతి రోజూ పెద్ద సంఖ్యలో మార్నింగ్ వాకర్స్ రాకపోక లు సాగిస్తుంటారని, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాంతంలో పార్కు ఏర్పాటు చేయడా నికి స్థల పరిశీలన చేసినట్లు తెలిపారు. పార్కు ఏర్పాటు పూర్తయితే స్థానిక ప్రజలకు ఉదయం, సాయంత్రం వేళ ల్లో వాకింగ్‌తో పాటు ఆహ్లాద కరమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతు ల కల్పనకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆధ్వర్యంలో ప్రాధాన్యత



ఇస్తున్నామని గుమ్మనూరు నారాయణస్వామి తెలిపారు.

# పదవీ విరమణ చేసిన వైఎస్సార్‌సీపీ జడ్పిటిసి, ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ లకు ఘనంగా సన్మానించిన వై.వెంకటరామి రెడ్డి



**గుంతకల్లు సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి):** గుంతకల్లు, గుత్తి, పామిడి మండలాల కు చెందిన వైఎస్సార్‌సీపీ జడ్పిటిసి, ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యుల పదవీకాలం ముగిసి పదవీ విరమణ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి క్యాంపు కార్యాలయం నందు ఘనంగా సన్మానం నిర్వహించారు ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గుంతకల్లు నియోజకవర్గం సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామి రెడ్డి మరియు వైస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు వై. నైరుతి రెడ్డి పాల్గొని పదవీ విరమణ చేసిన గుంతకల్లు మండలం ఎంపీటీసీ జి కొట్టాల గ్రామం వైస్ ఎంపీపీ ప్రభావతి, కసాపురం గ్రామం ఎంపీటీసీ జ్యోతి,దోసలోడికి గ్రామం షీలా బాయ్, ములకల పెంట గ్రామం నాగప్ప, కొంగనపల్లి గ్రామం హరి చక్రవర్తి, వైటి చెరువు గ్రామం పక్కిరప్ప,దంచర్ల గ్రామం ఎస్పీ పరశురామ్, పాత కొత్త చెరువు గ్రామం వెంకట్రెడ్డి,గుర్రపాడు గ్రామం హనుమంతు, అయ్యవారి పల్లి గ్రామం ఆచారి, నాగసముద్రం గ్రామం జయసింహారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సిపాయ్ భాష, గుత్తి మండలం ఎంపీపీ జి. విశాలాక్షి, జడ్పీటీసీ రాధికా ప్రవీణ్ కుమార్ యాదవ్, వైస్ ఎంపీపీ తిరుపాల్ అమ్మ, పామిడి మండలం వైస్ ఎంపీపీ నక్క సౌభాగ్యమ్మ లను మరియు ప్రజాప్రతినిధులను శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వై.వెంకటరామి రెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రతి నిధులుగా తమ పదవీకాలంలో ప్రజలకు అందించిన సేవలు అభినందనీ యమని అన్నారు. పదవులు శాశ్వతం కాదని, ప్రజలకు చేసిన సేవలు మాత్రం ఎప్పటికీ గుర్తుండిపోతాయ ని పేర్కొన్నారు. వైఎస్సా ర్‌సీపీ తరపున ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేసిన ప్రతి ప్రజాప్రతినిధి కి అభినందనలు తెలిపారు. పదవీ విరమణ చేసిన ప్రజాప్రతినిధులు భవిష్యత్తులో కూడా ప్రజలకు అందు బాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయా లని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకు లు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొని పదవీ విరమణ చేసిన ప్రజాప్రతి నిధులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి.





**ఆలమూరు సెప్టెంబర్ 26 (ప్రజాజ్యోతి):** భారతీయ జన సంఘ్ ప్రముఖ నాయకులు ఏకాత్మ మానవతావాద సిద్ధాంత కర్త పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ 110 వ జయంతి సందర్భంగా సెప్టెంబర్ 25 శుక్రవారం ఆలమూరు మండలం చొప్పెల్ల, జొన్నాడ లలో బిజెపి ఆలమూరు మండల అధ్యక్షుడు సుంకర శ్రీరాములు ఆధ్వర్యంలో పండిట్ దీనదయాళ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి అయినవిల్లి సత్తిబాబు గౌడ్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఎంవి కృష్ణారెడ్డి,ఆలమూరు మండల బిజెపి కార్యదర్శి పర్వతాల వెంకటనారాయణమూర్తి, బిజెపి ఆలమూరు మండల యువ మోర్చా అధ్యక్షుడు నందపునీడి లీలా సాయిరాం,బిజెపి ఆలమూరు మండల ఆఫీస్ బేరర్ కోడూరి మహేష్,బిజెపి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## బనగానపల్లె ముస్లిం సోదరుల చిరకాల స్వప్నం సాకారం




**బనగానపల్లె :సెప్టెంబర్=26 ప్రజాజ్యోతి** బనగానపల్లె ముస్లిం సోదరుల చిరకాల స్వప్నమైన షాదీఖానా సెప్టెంబర్ 27న సాయంత్రం 5:00 గంటలకు రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ బీసీ జనార్దన్ రెడ్డి గారి చేతుల మీదుగా ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమానికి బనగానపల్లె నియోజకవర్గం లోని ముస్లిం సోదరులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, మీడియా మిత్రులు హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

## సీఎం పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్,ఎస్పీ పరిశీలన

**రేపల్లెలో ప్రజావేదిక, హెలీప్యాడ్ స్థలాల పరిశీలన. అధికారులకు పలు సూచనలు**



**బాపట్ల సెప్టెంబరు 26 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** అక్టోబర్ 1న రేపల్లె మండలంలో నిర్వహించనున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లు వేగం పుంజుకున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొననున్న నేపథ్యంలో కార్యక్రమం నిర్వహించే ప్రాంతంలో ప్రజావేదిక, హెలీప్యాడ్ ఏర్పాటుకు అనువైన స్థలాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పరిశీలించారు.జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్‌తో కలిసి రేపల్లె మండలంలో పర్యటించిన కలెక్టర్ ప్రజావేదిక, హెలీప్యాడ్ నిర్మాణానికి అవసరమైన స్థలాలను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భద్రత, రాకపోకలు, వాహనాల పార్కింగ్, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు తదితర అంశాలపై అధికారులు దృష్టి సారించారు.కార్యక్రమానికి వచ్చే పింఛనుదారులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమ ప్రాంగణంలో వసతులు, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై శాఖల వారీగా చేపట్టాల్సిన చర్యలను అధికారులు పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎస్పీ సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.ఈ పరిశీలనలో ఆర్డీఓ బి.శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు, డీఆర్‌డీఓ పద్మావతి, వివిధ శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు, తహసీల్దార్, ఎంపీడీఓ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులు తమ హక్కులు కాపాడుకోవాలి

**:బడుగు మహిమరావు.**



**ఆలమూరు సెప్టెంబర్ 26(ప్రజాజ్యోతి):**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం ఆలమూరు గ్రామంలో పారసంస్థ సిబిఆర్ కో ఆర్డినేటర్ బడుగు మహిమా రావు ఆధ్వర్యంలో ఆలమూరు పంచాయతీ కార్యాలయం నందు దివ్యాంగుల చట్టం మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలు గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా రిసోర్స్ పర్సన్ గా హాజరైన ల్యాంప్ సంస్థ అద్వకేసి కో ఆర్డినేటర్ బడుగు సుబ్బాయమ్మ దివ్యాంగులకు చట్టం, ప్రభుత్వ పథకాలు, 2016 చట్టంలో 21 యొక్క రకాల దివ్యాంగులు ట్రైన్,బస్సు పాస్,దివ్యాంగులు ఏ కేటగిరి పరిధిలోకి వస్తారనేది, రూ.15000 పింఛన్ ఎవరు అర్హులు, స్కూటీలు ఎవరికి ఇస్తారు దాని యొక్క అర్హతలు, ఎవరూ కూడా ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా మీ హక్కులని మీరు కాపాడుకోవాలని . సదరం స్లాట్ బుకింగ్ ముందు ఆధార్ కార్డు ఫోన్ నెంబర్ లింక్ చేసుకోవాలని, సదరం రీ అసెస్మెంట్ కి వెళ్లిన అమలాపురం వెళ్లిన ఇంతవరకు సర్టిఫికెట్స్ రాలేదని ఆ విషయాన్ని మేము జిల్లా కలెక్టర్ వారి దృష్టికి తీసుకు వెళ్ళాము అన్నారు. చట్ట ప్రకారం 40 శాతం అంగవైకల్యం ఉంటే అర్హులని, ఎవరికైనా ఉపకార పరికరాలు అవసరమైతే ఆన్లైన్లో పెట్టుకుంటే ఉచితంగా ప్రభుత్వం అందిస్తుందని అనే విషయాలు పై అవగాహన కల్పించారు. ఇంకా రూ.15000 అర్హులైన చాలామంది ఉన్నారని, మంచానికి పరిమితమైన మరియు దివ్యాంగుల వివాహ ప్రోత్సాహ బహుమతి, శ్రీ అసెస్మెంట్ అని పెట్టి అంగవైకల్య శాతాన్ని తగ్గించటం, బహుళ వికలాంగత్వం, సదరం సర్టిఫికెట్స్ లో పేర్లు తప్పులు, పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని అన్నారు.తదుపరి దివ్యాంగులతో గ్రామ కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో దివ్యాంగులు 58 మంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## వైసీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన బుగ్గన అర్జున్ రెడ్డి



**ప్రజాజ్యోతి న్యూస్ సెప్టెంబర్ 26** ప్యాపిలి పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో యువనేత బుగ్గన అర్జున్ రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో నెలకొన్న వివిధ సమస్యలు, పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారంపై నాయకులు, కార్యకర్తలతో విస్తృతంగా చర్చించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలకు వైసీపీ ఐడీ కార్డులను పంపిణీ చేశారు. మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, పార్టీ సంస్థాగత బలోపేతంపై నాయకుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పార్టీ దృష్టికి తీసుకురావాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్యాపిలి మండల కన్వీనర్ పొద్దొడ్డి కృష్ణమూర్తి, బోరెడ్డి పుల్లా రెడ్డి, మెట్టు వెంకటేశ్వర రెడ్డి, గార్లదిన్నె రామసుబ్బయ్య, అలెబాధ బాలయ్య, చిట్టి రెడ్డి, ముడియాల చంద్రశేఖర్ రెడ్డి, ఎర్రగుంట్లపల్లి రజనీకాంత్ రెడ్డి, బూర్గుల శ్యాంసుందర్ రెడ్డి, గండికోట చిన్న రామాంజి, కొండయ్య, బొర్రా మల్లికార్జున్ రెడ్డి, నేరేడుచర్ల చంద్రశేఖర్ రెడ్డి, బోరెడ్డి రఘునాథ్ రెడ్డి, బోరెడ్డి రాము, బోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, వి. శ్రీనివాస్ రెడ్డి, సుంకయ్య, ప్రేమసాగర్ రెడ్డి, మెట్టు వింగేశ్వర్ రెడ్డి, బండ సోమశేఖర్, బండి పెద్దయ్య, ఎం రంగయ్య, బాలాజీ,తదితర వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎఐకెఎంఎస్ జాతీయ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



**బుట్టాయగూడెం సెప్టెంబర్ 26(ప్రజాజ్యోతి):-** బుట్టాయిగూడెం రామనర్సయ్య భవనం నందు ఖమ్మంలో జరిగే అఖిల భారత రైతు కూలీ సంఘం నాలుగవ జాతీయ మహాసభల పోస్టర్ ను ఆ పార్టీ శ్రేణులు శనివారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కారం రాఘవ మాట్లాడుతూ సెప్టెంబర్ 28,29,30 తేదీలలో ఖమ్మంలో అఖిలభారత రైతు కూలీ సంఘం నాలుగవ జాతీయ మహాసభలను నిర్వహించుకోవడం జరుగుతుందని తెలిపారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతులను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు.అతివృష్టి అనావృష్టి వలన రైతుల వేసిన పంటలు పూర్తిగా పాడైపోతున్నాయని దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు.ఎల్ నినో ప్రభావం వలన ప్రస్తుతం రైతులు పంటలు పండించడానికి తీవ్రమైన భయాందోళనలకు గురవుతున్నారన్నారు.రైతులు తీసుకున్న అప్పులను పూర్తిగా రద్దు చేయాలని,కొత్త అప్పులను ఇవ్వాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.ఈ జాతీయ మహాసభలలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల చర్చించుకోవడం జరుగుతుందన్నారు.కనుక పెద్ద ఎత్తున రైతులు పాల్గొని జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఈ భూషణం మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వడం లేదని విమర్శించారు.అంతేకాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ ఎరువుల రేట్లను విపరీతంగా పెంచి వేస్తున్నాయన్నారు.ఇప్పటికైనా రైతుల పండించిన అన్ని రకాల పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పి వై ఎల్ జిల్లా కన్వీనర్ టి బాబురావు, న్యాయవాది భాష శ్యాం బాబు, ఐ ఎఫ్ టి యు జిల్లా నాయకులు ఎం డి వి ప్రసాద్,రైతు కూలీ సంఘం మండల కమిటీ సభ్యులు కలుముల రాముడు,దువ్వెల గంగరాజు,నూపా పాపారావు, కలుమల లక్ష్మి, ఎం నందా,బి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలమూరు మండల పరిషత్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీ ప్రత్యూష కు ఎండివో ఏ రాజు అభినందనలు.



**ఆలమూరు సెప్టెంబర్ 26(ప్రజాజ్యోతి):**మండల పరిషత్ పాలక వర్గాల గడువు ముగియడం తో ప్రత్యేక అధికారుల పాలన అమల్లోకి వచ్చింది.డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరు అమలాపురం వారి ఉత్తర్వులు ప్రకారము ఆలమూరు మండల పరిషత్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన అమలాపురం గ్రౌండ్ వాటర్ అసిస్టెంట్ డైరెక్టర్ పి లక్ష్మీ ప్రత్యూష.ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు వీరె కొనసాగనున్నారు. మండల పరిషత్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీ ప్రత్యూష కు శనివారం ఎండివో ఏ రాజు ఇండోర్ ప్లాంట్ అందజేసి అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఏవో మెహర్ ప్రకాష్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సన్మానం సరే.. మా వేతనాల మాటేమిటి?

**ఎటపాక మండల పరిషత్‌లో ఎంపీటీసీల కన్నెర్ర**

**పెండింగ్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని పట్టు**



**ఎటపాక, సెప్టెంబర్ 26 (ప్రజాజ్యోతి):** ఎటపాక మండల ప్రజా పరిషత్‌లో ఎంపీటీసీ సభ్యుల పదవీకాలం ముగిసిన సందర్భంగా శనివారం మండల ప్రజా పరిషత్ ఆధ్వర్యంలో ఎంపీటీసీ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎంపీపీ, జడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ.. తమకు గత మూడు సంవత్సరాలుగా గౌరవ వేతనం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పదవీకాలం పూర్తయిన నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాన్ని వెంటనే చెల్లించేలా మండల ప్రజా పరిషత్ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని జిల్లా పరిషత్ సీఈఓ దృష్టికి తీసుకెళ్లి, త్వరలోనే గౌరవ వేతనం అందేలా చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులు హామీ ఇచ్చినట్లు తెలిపారు. మండల ప్రజా పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో ఎంపీపీ కాకా కామేశ్వరి, జడ్పీటీసీ ఉబ్బ సుస్మిత, వైస్ ఎంపీపీలు దొంతు మంగేశ్వరరావు, పెనుబల్లి కుమారి, ఎంపీటీసీ సభ్యులు గొంగడి వెంకటరామిరెడ్డి, బూరం అంజలి, పరిషిక కమల, పెనుబల్లి కృష్ణకుమారి, సోయం వెంకటరమణ, పాయం దేవి, కంటే రాజు తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతో ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలి.



**పోడూరు. ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. సెప్టెంబర్ 26.** అంగన్వాడి కేంద్రాలలో లబ్దిదారులైన గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు అందించే పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యం పరిరక్షించుకోవాలని మండల టీడీపి ఉపాధ్యక్షులు రుద్రరాజు రవి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 25 ఏళ్ళ ప్రజాసేవ సందర్భంగా నిర్వహిస్తున్న సేవాసంకల్ప కార్యక్రమంలో శనివారం పోడూరులోని వెలగలమ్మచెరువు అంగన్వాడి సెంటర్లో సిడిపిఓ ఇందిర పర్యవేక్షణలో అంగన్వాడీ ఉత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సూపర్వైజర్ హసీనా మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు చేయించుకోవలసిన ఆరోగ్య పరీక్షలను, బాలింతలు తీసుకోవలసిన జాగ్రత్తలను పిల్లల సంరక్షణపట్ల అవగాహన కల్పించారు. స్థానిక కూటమి నాయకులు శీలబోయిన జయ రామకృష్ణ దొమ్మేటి పురుషోత్తం తదితరులు వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు ,అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ గురైన మహిళ!..

**పరామర్శించి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచనలు!..**

**టి.డి.పి,పార్టీ అధ్యక్షులు బొర్ర నరేష్ కుమార్!..**



**వరరామచంద్రాపురం,సెప్టెంబర్(ప్రజాజ్యోతి ప్రతినిధి)**వి.ఆర్.పురం, మండలం వడ్డిగూడెం గ్రామంలో ముత్యాల భవాని,(టి.డి.పి కార్యకర్త )అనే మహిళ ఇంటిఆవరణలో దుస్తులు ఆరేస్తుండగా కరెంట్ షాక్ కిగురై, కోతులుగుట్ట హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారని, విషయం తెలిసిన వెంటనే, పరామర్శించి అక్కడ అందుతున్న వైద్య సేవలు, అడిగి తెలుసుకున్నామని, తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొర్ర నరేశ్ కుమార్,సీనియర్ నాయకులు బొర్ర నరసింహారావు, తెలిపారు. శనివారం,ఈ సందర్భంగా, వారు మాట్లాడుతూ, ప్రమాదం జరిగిందని తెలిసిన వెంటనే కూనవరం, మండలం కోతులగుట్ట, ప్రభుత్వ వైద్య శాలకు,వెళ్లి డాక్టర్ ని అడిగి పరిస్థితి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని సూచించామని, వివరించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో,ముత్యాల చంద్రశేఖర్, చక్రపాణి, ఆదినారాయణ ,శంకర్రావు, తదితరులు హాజరయ్యారు.

## వినాయకుడి లడ్డూ వేలంలో రికార్డు ధర

**జేపీ నగర్‌లో ఘనంగా ముగిసిన వినాయక ఉత్సవాలు రూ1.17 లక్షలకు లడ్డూ ప్రసాదం వేలం**



బాపట్ల సెప్టెంబరు 26 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) వినాయకుడి లడ్డూ ప్రసాదానికి భారీ డిమాండ్ ఏర్పడింది. బాపట్ల మండలం కొండుభొట్లవారిపాలెం జేపీ నగర్ కాలనీలో నిర్వహించిన శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవాల ముగింపు సందర్భంగా జరిగిన వేలంలో లడ్డూ ప్రసాదం రూ.1,17,116లకు విక్రయమైంది. కోసూరి సుబ్బారావు, ఉమాదేవి దంపతుల కుమారుడు ప్రదీప్‌కుమార్ ఈ వేలంలో లడ్డూను దక్కించుకున్నారు.శ్రీ వరసిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో 22వ వార్షికోత్సవం సందర్భంగా 12 రోజులపాటు ఉత్సవాలను నిర్వహించారు. కాలనీలోని శ్రీ అలివేలుమంగా పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మండపంలో నిత్య పూజలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల చివరి రోజున ప్రత్యేక హోమం, పూజా కార్యక్రమాలు నిర్వహించడంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.లడ్డూ వేలం సందర్భంగా భక్తులు ఉత్సాహంగా పాల్గొనడంతో వేలం పోటాపోటీగా సాగింది. చివరకు రూ.1,17,116లకు ప్రదీప్‌కుమార్ లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం మేళతాళాల మధ్య లడ్డూ ప్రసాదాన్ని స్వగృహానికి తీసుకెళ్లారు.ముగింపు కార్యక్రమంలో భాగంగా నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. సుమారు 1,500 మంది భక్తులు, గ్రామస్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. 12 రోజులపాటు జరిగిన పూజా కార్యక్రమాలతో పాటు ముగింపు వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఉత్సవాల నిర్వహణకు సహకరించిన కాలనీవాసులు, గ్రామస్తులు, భక్తులకు శ్రీ వరసిద్ధి వినాయక యూత్ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## కేవీకే బనవాసిని సందర్శించిన 130 మంది విద్యార్థులు



**నందవరం, సెప్టెంబర్ 27(ప్రజా జ్యోతి ):**మండల పరిధిలో ముగతి గ్రామంలోని మోడల్ స్కూల్కు చెందిన 9వ, 10వ తరగతి విద్యార్థినీ, విద్యార్థులు మరియు ఇంటర్మీడియట్ విద్యార్థులు సుమారు 130 మంది వృత్తి విద్య మరియు పారిశ్రామిక సందర్శన (అగ్రికల్చరల్ ఇండస్ట్రియల్ టూర్ ) కార్యక్రమంలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) బనవాసిని సందర్శించారు. ఈ సందర్భంగా కేవీకే బనవాసి కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ కె. రాఘవేంద్ర చౌదరి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, 10వ తరగతి అనంతరం వ్యవసాయ విద్యను అభ్యసించేందుకు ఉన్న వివిధ అవకాశాలను వివరించారు. విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో బైపీసీ ఎంపిక చేసుకుని, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం అనంతరం ఎపసెట్ లేదా ఐసీఆర్ ప్రవేశ పరీక్ష ద్వారా వ్యవసాయ విద్యలో ప్రవేశం పొందవచ్చని తెలిపారు. ఐసీఆర్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించి మంచి ర్యాంక్ పొందిన విద్యార్థులకు నిబంధనల ప్రకారం స్కాలర్‌షిప్/ఆర్థిక సహాయం, ప్రయాణ మరియు ఇతర అలవెన్సులు లభించే అవకాశాలు ఉన్నాయని వివరించారు.అనంతరం కేవీకే బనవాసి శాస్త్రవేత్త డాక్టర్ టి. చందన కేవీకే విధులు, రైతులకు అందిస్తున్న సేవలు మరియు వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరవేసే విధానాలను విద్యార్థులకు వివరించారు. రైతు శిక్షణ కార్యక్రమాలు, క్షేత్ర ప్రదర్శనలు, ప్రథమ శ్రేణి ప్రదర్శనా క్షేత్రాలు (ఫ్లాడ్స్ ), విత్తనోత్పత్తి కార్యక్రమాలు, సాంకేతిక సలహాలు మరియు కేవీకే సంస్థాగత నిర్మాణం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్శనలో భాగంగా విద్యార్థులు వర్మీకంపోస్ట్ డెమో యూనిట్, తేనెటీగల పెంపకం డెమో యూనిట్, మట్టి మరియు నీటి పరీక్షా ప్రయోగశాల, విత్తనోత్పత్తి క్షేత్రాలు, క్రాప్ట్ క్యాఫెటీరియా మరియు షేడ్‌నెట్ యూనిట్‌లను సందర్శించారు. ఆయా యూనిట్ల నిర్వహణ, ఉపయోగాలు మరియు వ్యవసాయంలో వాటి ప్రాధాన్యతను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ టి. శ్రీ చందన, డాక్టర్ ఎం.వి. నిరంజన్ రెడ్డి, సాయిల్ టెస్టింగ్ టెక్నీషియన్ తేజ కుమార్ మరియు వై.పి. సుధాకర్ పాల్గొని విద్యార్థులకు వివిధ యూనిట్లు, వ్యవసాయ సాంకేతికతలు మరియు వాటి ఉపయోగాల గురించి వివరించారు.ఈ సందర్శన ద్వారా విద్యార్థులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికతలు, వ్యవసాయ ఆధారిత ఉపాధి అవకాశాలు మరియు వ్యవసాయ విద్యలో ఉన్నత విద్యా అవకాశాలపై ప్రత్యక్ష ప్రాయోగిక అవగాహన లభించింది.ఈ కార్యక్రమం లో విద్యార్థులు కివికె సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో ఘనంగా 'అంగన్‌వాడీ ఉత్సవం'

**42 కేంద్రాల్లో మూడు రోజుల పాటు నిర్వహణ**

**పోషణ, ఆరోగ్యంపై లబ్ధిదారులకు విస్తృత అవగాహన**

**ఆకట్టుకున్న చిన్నారులు, తల్లుల ఆటపాటలు**





**ఎటపాక, సెప్టెంబర్ 26 (ప్రజాజ్యోతి):** ఎటపాక ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో 'అంగన్‌వాడీ ఉత్సవం' వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి విడత కింద ప్రాజెక్టు పరిధిలోని 42 కేంద్రాల్లో సెప్టెంబర్ 26, 28, 29 తేదీల్లో మూడు రోజుల పాటు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పర్యవేక్షకులు పావని రాధ పలు కేంద్రాలను సందర్శించి ఉత్సవాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పౌష్టికాహారం, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం, సకాలంలో వేయించాల్సిన టీకాలు, పూర్వ ప్రాథమిక విద్య (ప్రీస్కూల్) ప్రాముఖ్యతపై లబ్ధిదారులకు సమగ్రంగా అవగాహన కల్పించారు. కేంద్రాల పనితీరు, అందుతున్న సేవలపై లబ్ధిదారులతో నేరుగా ముఖాముఖి నిర్వహించి వారి అభిప్రాయాలు, అనుభవాలను తెలుసుకున్నారు. ఈ వేడుకల్లో భాగంగా చిన్నారులు, తల్లుల భాగస్వామ్యంతో నిర్వహించిన వివిధ సరదా ఆటలు, వినోదాత్మక పోటీలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. నిరంతరం సేవలందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలను ఈ సందర్భంగా అధికారులు ప్రత్యేకంగా అభినందించారు. ప్రస్తుతం జరుగుతున్న పోషణ మాసోత్సవాలకు ఈ ఉత్సవాన్ని అనుసంధానం చేస్తూ, సమాజంలో పోషకాహారం మరియు అంగన్‌వాడీ సేవలపై మరింత చైతన్యం పెంచడమే ఈ కార్యక్రమ ముఖ్యోద్దేశమని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, తల్లులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ నాయకులు నిరసన



**గుంతకల్లు సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి):** ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని ఏపీ సి సి, డిసిసి అధ్యక్షులు వై మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు గుంతకల్లు పట్టణ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎం.మహేంద్ర ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేస్తూ శనివారం స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ షేక్ అలం నవాజ్, జిల్లా జనరల్ సెక్రెటరీ లు నబి రసూల్, అబ్దుల్ మాలిక్ సాబ్ పాల్గొని మాట్లాడుతూ ఓట్ చోరీ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని, ఒక బాధ్యతలో ఉన్నదికారి ఎస్ ఐ ఆర్ పేరుతో ఓట్లను తారుమారు చేసి 13 కోట్ల ఓట్లను తొలగించడం అది ప్రజాస్వామ్యానికి పూర్తి విరుద్ధమని మరో ఇద్దరు సహచర బృందం భారత ప్రధాని ఎన్నికల్ కమిషనర్ లు దాదాపు పది నెలల నుండి 14 సార్లు వారికి జ్ఞానేశ్ కుమార్ కు చెప్పుతున్న వారిని పక్కన పెట్టి ఏకపక్ష నిర్ణయాలతో బిజెపి పార్టీకి ఈవీఎం లు ద్వారా ఓట్లు చోరీ చేయడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ అనేకసార్లు ఓట్ చోరీ జరుగుతుందని పలుమార్లు వీడియో ద్వారా ఒక వ్యక్తికి 5 నుండి 6 వరకు ఒకే వ్యక్తికి ఓటు ఉందని ఇలాంటివి భారతదేశంలో చాలా అవుతవుకులు ఉన్నాయని వారికి అనుకూలం ఉన్న వ్యక్తుల ను బిజెపి ప్రభుత్వం మరియు ఎన్నికల కమిషనర్ ఇరువురు కలిసి ఇలాంటి దొంగ ఓట్లను తయారు చేస్తున్నారని ప్రాజెక్టు పెట్టి మరి ప్రజలకు చూపించి వివరించారు. అలా చెప్పినందుకు.. రాహుల్ గాంధీ ని దేశద్రోహం కేసులు పెట్టి అనేక రకాలుగా అవమానిం చడం జరిగింది. ఈరోజు ఇండియా టుడే జర్నలిజం గోవా, పశ్చిమబెంగాల్, ఢిల్లీ లో పర్యటించి ఈవీఎంల ద్వారా ఓట్లు చోరీ మరియు ఎస్ ఐ ఆర్ విధానం చూపి ఓట్లను తొలగించడం ప్రతి విషయాన్నిచున్నంగా పత్రికల ద్వారా చూపించి ఆరోజు రాహుల్ గాంధీ చెప్పిందే ఈరోజు నిజమైంది కాంగ్రెస్ పార్టీ మొదటి నుండి చెబుతూనే ఉంది ఓట్లు చోరీ చేసి బిజెపి ప్రభుత్వం గద్దెన కూర్చొని ప్రజలను ఇబ్బందులకు గురిచేసి అదాని, అంబానీ పెత్తందారులకు ఇవాళ వేలకోట్ల రూపాయలు వారికి కట్టు పెడుతున్నారు. ఇదంతా కేవలం బిజెపి ప్రభుత్వం వారికి అందుబా టులో ఉన్న వ్యక్తులను వారి మాట వింటున్న వ్యక్తులను ప్రధానమైన అధికార కుర్చీ లో కూర్చోబెట్టి ఇలా దోచు కోవడం దాదాపు 12 సంవత్సరాల నుండి ఇవాల్టికి జరుగుతూనే ఉంది.. కావున జ్ఞానేశ్వర్ ను వెంటనే తన అధికారా నికి రాజీనామా చేసి ఆయన వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ లేని పక్షాన ఈ విషయాన్ని మరింత ఉధృతం చేసి కలిసి వచ్చే పార్టీలు ప్రజా సంఘాలు కలుపుకొని జ్ఞానేష్ కుమార్ ని అరెస్టు చేసే వరకు కాంగ్రెస్ పార్టీ విడిచిపెట్టదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రెటరీ ఖాదర్ వలీ, బీసీ విభాగం చైర్మన్.. గోపాల్, డాక్టర్ అక్బర్, నరసన్న, రామచంద్ర, ఎర్రి స్వామి, మస్తానప్ప, కిష్టప్ప, ఏసన్న తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 28, 29, 30 ఖమ్మంలో జరిగే రైతు సంఘం జాతీయ మహాసభల గోడపత్రాలు విడుదల




**గుంతకల్లు సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి):** తెలంగాణ రాష్ట్రం ఖమ్మం పట్టణంలో ఈనెల 28 29 30 తేదీలలో జరిగే అఖిలభారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జాతీయ నాలుగవ మహాసభలు వేలాదిమంది రైతులతో నిర్వహించడం జరుగుతు న్నది. ఈ సభలు విజయ వంతం చేయాలని గుంతకల్లు పట్టణంలోని ఆలూరు రోడ్డు లోగల రామ్ రెడ్డి కాలనీ నందు కావాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ ఆధ్వర్యంలో మహాసభల గోడపత్రాలు విడుదల చేశారు. సురేష్ మాట్లాడుతూ న్యూ డెమోక్రసీ పార్టీకి అనుబంధంగా దేశంలో అనేక రాష్ట్రాలలో రైతాంగ సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలను నిర్వహించడం జరుగుతు న్నది. నరేంద్ర మోడీ ప్రభుత్వం తన 12 సంవత్స రాల పరిపాలన కాలంలో రైతాంగానికి పంటల గిట్టు బాటు ధరను కల్పించకుం డా విత్తనాలు, ఎరువులు, రసాయనిక మందుల పైన రేట్లను అధికంగా పెంచి రైతులు వాటిని కొనలేని పరిస్థితికి తీసుకురావడం జరుగుతున్నది. దీనివలన వ్యవసాయ రంగం తీవ్రంగా నష్టపోయి రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి రావడం జరుగుతు న్నది. కార్పొరేట్ కంపెనీలకు 16 లక్షల కోట్ల రూపాయల రుణాలు మాఫీ చేయడం సబ్సిడీలు ఇవ్వడం జరుగుతున్నది. దేశంలో వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడానికి రైతులు నిరంతరం ఆందోళన కార్యక్రమాలు చేయడం జరుగుతున్నది. ప్రధాని నరేంద్ర మోడీ అమెరికా అధ్యక్షుడికి భయపడి దిగుమతుల సుంక న్ని జీరో టారిఫ్ కు అనుకూలంగా సంతకాలు చేయడంతో అమెరికా దేశానికి సంబంధించిన వ్యవసాయ ఉత్పత్తులు దేశంలో దిగుమతి కావడంతో దేశీయ వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలోకి వెళ్లడం జరుగుతున్నది. భారత వ్యవసాయ ఉత్పత్తులను అమెరికా దేశానికి ఎగుమతి చేస్తే 50 శాతం సుంకాలను అమెరికా అధ్యక్షుడు విధించడం జరుగుతున్నది. దీనిని భారత ప్రభుత్వం వ్యతిరేకించలేని పరిస్థితిలో ఉన్నది. ఎల్ లినో దుర్భిక్షం వలన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యంగా రాయలసీమ జిల్లాలలో తీవ్ర కరువు, పంటలు ఎండిపోవడం రైతాంగం వందల వేల కోట్ల రూపాయలను నష్టపోవడం జరిగినది. కరువు నివారణ చర్యలను చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రవైప ల్యం చెందినది. దీనివలన వ్యవసాయ కూలీలు ఇతర ప్రాంతానికి వలసలు పోవడం జరుగుతున్నది. పశు వులకు పశుగ్రాసం లేకపోవడంతో లక్షల రూపా యల విలువ చేసే పశువుల ను వేల రూపాయలు అమ్ముకోవడం జరుగుతు న్నది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రైతుల ను ఆదుకునే విధంగా వలస లను ఆపే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుచున్నాము. ఖమ్మం పట్టణంలో ఏఐకేఎంఎస్ నిర్వహిస్తున్న నాలుగో జాతీయ మహాసభలను రైతులు పాల్గొని విజయ వంతం చెయ్యాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ గుంతకల్లు డివిజన్ కమిటీ సభ్యులు జిలాన్,సత్తార్, రామాంజనేయులు, సభ్యులు రాందాస్ నారాయణ, నెట్టప్ప, మేరీ తదితరులు పాల్గొనడం జరిగింది.

## మద్యం పేదరికాన్ని పెంచుతోంది!బిలి కొప్పాల రఘు

**తాగే వాడి ఇల్లు పేదరికంలో.. అమ్మే వాడి ఇల్లు సంపదలో**

**నంద్యాల =సెప్టెంబర్=26ప్రజాజ్యోతి** నంద్యాల జిల్లాలో మద్యం వల్ల పేద కుటుంబాల ఆర్థిక పరిస్థితి మరింత దిగజారుతోందని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు కొప్పాల రఘు అన్నారు. పేదరిక నిర్మూలనపై ప్రభుత్వాలు ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు.కొప్పాల రఘు మాట్లాడుతూ... రోజువారీ కూలి, చిన్నచిన్న పనులు చేసుకుని జీవించే పేద కుటుంబాలు సంపాదించిన డబ్బును మద్యం వంటి వ్యసనాలకు ఖర్చు చేస్తే కుటుంబ అవసరాలకు డబ్బు మిగలదన్నారు. దీంతో పిల్లల చదువు, వైద్యం, ఆహారం, గృహ అవసరాలపై ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. మరో వైపు మద్యం విక్రయించే వ్యక్తులు అదే వ్యాపారం ద్వారా భారీగా ఆదాయం పొందుతున్న పరిస్థితిని ప్రజలు ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. "పేదవాడు తన సంపాదనను కుటుంబ భవిష్యత్తు కోసం వినియోగించాలి. వ్యసనాలకు దూరంగా ఉండి ఆర్థికంగా ఎదగాలి" అని సూచించారు.పేదరికాన్ని కేవలం సానుభూతితో కాకుండా ఉపాధి, భూమి, విద్య, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక స్వావలంబన వంటి మార్గాల ద్వారా ఎదుర్కోవాలని కొప్పాల రఘు పిలుపునిచ్చారు. అదేవిధంగా త్వరలో తను చేపట్టబోయే పేదరికంపై నా పోరాట యాత్ర లక్ష్యం ప్రతి పేద కుటుంబం పేదరికం నుంచి బయటపడాలి.. ప్రతి పేద కుటుంబం ఆర్థికంగా బలపడాలని తెలిపారు.



## న్యాయవాదుల మధ్య కమల్ జన్మదిన వేడుకలు



**బాపట్ల సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** సీనియర్ న్యాయవాది కమల్‌కుమార్ జన్మదిన వేడుకలను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విన్నకోట సత్యప్రసాద్, మాజీ అధ్యక్షుడు కంచర్ల అవినాష్ తదితర న్యాయవాదులు కమల్‌కుమార్‌తో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదులు కమల్‌కుమార్ సేవలను ప్రస్తావిస్తూ, ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. న్యాయవాదుల మధ్య పరస్పర స్నేహపూర్వక వాతావరణంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాదులు కంచర్ల వినోద్, ఎన్ హరి ప్రకాష్, బి,స్టాన్లీ, డి,బెంజి, ఎ,అనూష, శరత్ చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మకు 131వ జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పించిన అఖిలభారత రజక సంఘం.



**నంద్యాల గోస్పాడు రి=26. (ప్రజా జ్యోతి)** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, చాకలి ఐలమ్మ (చిట్యాల ఐలమ్మ) 131వ జయంతి సందర్భంగా గోస్పాడు మండల పరిధిలోని యాల్లూరు గ్రామంలో అఖిలభారత రజక సంఘం ఆధ్వర్యంలో ఆమెకు ఘనంగా నివాళులర్పించారు. అఖిలభారత రజక సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, రాష్ట్ర ఉపాధ్యక్షులు సుబ్రమణ్యం రజక పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుబ్రమణ్యం రజక మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం నిజాం నిరంకుశ పాలన, భూస్వాముల అణచివేతకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి ఐలమ్మ అందించిన స్ఫూర్తిని కొనియాడారు. తన భూమిని కాజేయడానికి ప్రయత్నించిన విస్నూరు దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డిని ధైర్యంగా ఎదిరించి, ఎర్రజెండా పట్టి, తన పంటను కాపాడుకున్న ఐలమ్మ సాహసం తెలంగాణ రైతాంగ పోరాటంలో మొదటి విజయాన్ని అందించింది. ఆమె పోరాటం తర్వాతి తరాల రజకులకు, వెనుకబడిన వర్గాల వారికి నిరంతర స్ఫూర్తి అని, ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఉద్ఘాటించారు. చాకలి ఐలమ్మ రజక (చాకలి) కులానికి చెందిన వ్యక్తి. ఆమె సేవలను గుర్తించి తెలంగాణ ప్రభుత్వం ఆమె జయంతిని అధికారికంగా నిర్వహిస్తోందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత రజక సంఘం నాయకులు, గోస్పాడు మండల అధ్యక్షుడు మద్దిలేటి, ఉపాధ్యక్షుడు ఏ . మదిలేటి, లక్ష్మయ్య, నడిపి సుబ్బరాయుడు, చిన్న నాగయ్య, నాగేష్, నాగభూషణం, గోవింద పల్లె మదిలేటి, మర్రి పల్లె నాగరాజు, గ్రామ పెద్దలు, రజక సోదర సోదరీమణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బంగారు చైన్ చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్



**బేతంచెర్ల:సెప్టెంబర్26(ప్రజా జ్యోతి)** పట్టణంలో మహిళ మెడలోని బంగారు చైన్‌ను అపహరించిన కేసులో ఇద్దరు నిందితులను బేతంచెర్ల పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి చోరీకి గురైన బంగారు చైన్‌తో పాటు నేరానికి ఉపయోగించిన పల్సర్ మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు.. ఈ నెల 23న మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో బేతంచెర్ల పట్టణానికి చెందిన మాలి సరస్వతి వీరారెడ్డి ఇంటి సమీపంలో వెళ్తుండగా ఇద్దరు వ్యక్తులు పల్సర్ మోటార్‌సైకిల్‌పై ఆమెను వెంబడించి, మెడలోని బంగారు చైన్‌ను అపహరించి పరారయ్యారు. బాధితురాలు అదే రోజు సాయంత్రం 4 గంటలకు బేతంచెర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా సీఐ డి. వెంకటేశ్వరరావు, ఎస్సై రమేష్‌బాబు తమ సిబ్బంది తో కలిసి నిందితుల కోసం గాలించారు. పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు సిమెంట్‌నగర్ గ్రామం వెలుపల ఉన్న సుంకులమ్మ గుడి వద్ద నంద్యాల పట్టణం హరిజనవాడకు చెందిన ఆరంగుల మద్దిలేటి (26), ఆరంగుల మధుకుమార్ (22)లను అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి చోరీ సొత్తు బంగారు చైన్‌ను రికవరీ చేయడంతో పాటు, నేరానికి ఉపయోగించిన పల్సర్ మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## వినియోగదారులు బ్యాంక్ సేవలను ఉపయేగించుకోండ్డి



**నంద్యాల =సెప్టెంబర్=26 ప్రజాజ్యోతి** ప్రియమైన వినియోగదారు లారా, సెప్టెంబర్ 28, 29 మరియు 30 తేదీలలో బ్యాంకుల సమ్మె దృష్ట్యా, సెప్టెంబర్ 27 ఆదివారం నాడు అన్ని శాఖలు పనిచేస్తాయి. దయచేసి మీ అత్యవసర బ్యాంకింగ్ పనులను సెప్టెంబర్ 27, 2026 నాటికి పూర్తి చేసుకోగలరని మనవి. మా 24/7 డిజిటల్ సేవలు – ఇంటర్నెట్ బ్యాంకింగ్ / మొబైల్ బ్యాంకింగ్ (యూనియన్ ఈజ్) / యూపి ఐ/ ఎటీ ఎం లు / బిసీ / బ్యాంక్ మిత్ర పాయింట్లు కూడా మీకు అందుబాటు లో ఉంటాయి – యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

# సోలార్ వినియోగంతో విద్యుత్ ఖర్చులు ఆదా

**-ఎమ్మెల్యే సత్యప్రభ**

**--ఏలేశ్వరంలో యన్‌యన్ సోలార్ సొల్యూషన్స్ ప్రారంభించిన ఎమ్మెల్యే సత్యప్రభ**



**కాకినాడ జిల్లా సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ఏలేశ్వరం పట్టణంలోని షిర్డీ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన యన్‌యన్ సోలార్ సొల్యూషన్స్ సంస్థను ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రారంభించారు. కోరుకొండ రామకృష్ణ, కోటిలింక నాగేంద్ర, చాగంటి స్వామి భాగస్వామ్యం తో ఏర్పాటు చేసిన ఈ సంస్థ ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని సంస్థ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మాట్లాడుతూ ప్రస్తుతం విద్యుత్ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు సోలార్ విద్యుత్ వినియోగం వైపు అడుగులు వేయాలని సూచించారు. సౌర విద్యుత్‌ను వినియోగించడం ద్వారా విద్యుత్ ఖర్చులను ఆదా చేసుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడవచ్చని పేర్కొన్నారు. సంస్థ ప్రొప్రైటర్ కోరుకొండ రామకృష్ణ మాట్లాడుతూ తమ సంస్థలో విక్రమ్, వారీ, టాటా పవర్, అదానీ తదితర ప్రముఖ సోలార్ కంపెనీల ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రారంభ రోజే సుమారు 20 యూనిట్లకు రిజిస్ట్రేషన్ జరిగినట్లు పేర్కొన్నారు. ప్రజలు సోలార్ విద్యుత్‌పై అవగాహన పెంచుకుని తమ సంస్థ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు, పట్టణ, మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు జ్యోతుల పెదబాబు, మూది నారాయణస్వామి, సీబీఎన్ ఆర్మీ కోఆర్డినేటర్ యాళ్ల జగదీష్ ఏలేశ్వరం,లింగంపర్తి సొసైటీ అధ్యక్షులు సూతి బూరయ్య, పెంటకోట మోహన్, నాయకులు అలమండ చలమయ్య, దనేకుల భద్రం, బొదిరెడ్డి గోపి, డాక్టర్ సఖిరెడ్డి విజయబాబు, బస్వా మహాలక్ష్మి ప్రసాద్, మైరాల కనకారావు, పసల సూరిబాబు, సూతి ప్రభాకర్, గంగిరెడ్ల మణికంఠ, రుచి రమేష్, బుద్ధ సూర్యప్రకాశ్, పలివెల శ్రీనివాస్, పెంటకోట శ్రీధర్, కోరుకొండ నూకరాజు, అవసరాల సూర్యప్రకాశ్‌రావు, గట్టెం వెంకటరమణ, మాగాపు వీరబాబు, నూకతాటి ఈశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

# రియల్ మాఫియా హవా పుంత రోడ్డు ఆక్రమించారని రైతుల ఆవేదన

**మాకు తెలియదని పంచాయతీ అధికారులు చెప్పడం గమనార్హం**



**తాళ్లపూడి, సెప్టెంబర్ 26, ప్రజాజ్యోతి న్యూస్** తాళ్లపూడి లో లేఅవుట్ యజమానులు పుంత ఆక్రమించుకొని రోడ్డు నిర్మాణం చేపడుతున్నారని సమీప రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లేఔట్ ప్లాటులను పుంత రోడ్డుకు ఫేసింగ్ పెట్టి ప్లాట్లు వేసి వాటికి అణువుగా దారిని మార్చుకుని రైతులు వెళ్ళు మార్గమైన పుంత రోడ్డును ఆక్రమించుకొని పక్కా రోడ్డును నిర్మాణం చేపడుతున్న సంబంధిత అధికారులు నోరు మెదపడం లేదని రైతులు వాపోయారు. ఎటువంటి పర్మిషన్ లేకుండా ఈ రోడ్డు నిర్మాణం చేపట్టి పుంత రోడ్డును మీరు రోడ్డు ఎలా ఆక్రమించుకుంటారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిజానికి రుడా నిబంధనల ప్రకారం ఈ పుంత రోడ్డును వినియోగించుకోకుండా నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు నిర్మాణం చేయడమే కాకుండా రైతులతో ఘర్షణలకు దిగి వారిని భయభ్రాంతులను చేసి దౌర్జన్యానికి పాల్పడుతున్నారని తాసిల్దార్ కి రైతులు ఫిర్యాదు చేశారు. రుడా నిబంధనలో "తుంగలో తొక్కి వారి ఇష్టానుసారంగా లేఅవుట్ వేసి రైతులకు ఇబ్బందికరంగా ప్రవర్తిస్తున్నారని అన్నారు. చుట్టూ వ్యవసాయ భూములు మధ్యలో లేఔట్ వేసి భూమి ఎత్తు పెంచడం కారణంగా చుట్టు పొలాలన్నీ కూడా లోతట్టు మయం అయ్యి ముంపున గురై వ్యవసాయానికి తీవ్ర నష్టం జరుగుతుందని రైతులు వాపోయారు. రుడా నిబంధన ప్రకారం ప్రభుత్వ రోడ్డును లేఔట్ రోడ్డు గా కస్టమర్లకు చూపించి ప్లాట్లను విక్రయించుటకు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రయత్నిస్తున్నారని ఇది పూర్తిగా రుడా నిబంధనలకు విరుద్ధం అని ఈ లేఅవుట్ కు అన్నీ పర్మిషన్ సక్రముగా ఉన్నాయా అని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణంకై పంచాయతీ అధికారులను రైతులు ప్రశ్నించగా వాటి గురించి పూర్తిగా మాకు ఏమీ తెలియదు అని పంచాయతీ కార్యదర్శి చెప్పడం విశేషం. లేఔట్ వేసేటప్పుడు వాటికి పూర్తి అనుమతులు ఉన్నావా లేవా అని తనిఖీ చేయవలసిన బాధ్యత పంచాయతీ అధికారులకు తెలియాల్సి ఉందా లేదా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. జనవాసాల్లో రోడ్లు లేవు మురుగునీరు డ్రైన్లు లేవు ఎక్కడ లేవట్లు ఉంటే అక్కడ చుట్టుపక్కల జనావాసాలు లేకపోయినా పంచాయతీ అధికారులు ప్రభుత్వ నిధులతో రోడ్లు వేసి స్వామి భక్తిని చాటుకుంటున్నారని జనావాసాలలో తాగడానికి నీరు లేకపోయినా ఒక లేఔట్ లో పంచాయతీ కుళాయి కనెక్షన్లు విశేషం. నిరుపయోగంగా ఉన్న లేఔట్ మీద ఉన్న శ్రద్ధ జనాల సమస్యపై ఎందుకు లేదు అని ప్రశ్నిస్తున్నారు. పంచాయతీ అధికారులు ఈ సమస్యను పరిష్కరించక పోతే కలెక్టర్ ఫిర్యాదు చేస్తామని రైతులు తెలిపారు

# భయం నీడలో బాల్యం!... ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులో విద్యార్థుల ప్రాణాల పందెం!...





**వరరామచంద్రాపురం, సెప్టెంబర్ 26(ప్రజాజ్యోతి ప్రతినిధి)** ఒకవైపు భారీవర్షం,మరోవైపునింగినంటేలా పొంగిపొర్లుతున్న వాగు, ఆ ఉధృతికి నిలువునా కొట్టుకుపోయిన, రహాదారి అయినా తప్పని పరిస్థితిలో ఏక్షణం ఏముప్పు ముంచుకొస్తుందో తెలియక భయం భయంగా కాలవ దాటుతున్న చిన్నారుల విద్యార్థులు,ఇదిమండలంలోని మడివి గుంపు,-- సిరియం గుంపు గ్రామాలమధ్య రోజూ కనిపిస్తున్న దయనీయదృశ్యం. అధికారుల ఘోరనిర్లక్ష్యం, అంతులేని అలసత్వానికి నిలువెత్తు సాక్ష్యం. గ్రామస్తుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. వారంరోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు ముల్కనపల్లి పంచాయతీ పరిధిలోని మడివి గుంపు -- సరియం గుంపుల, మధ్య ఉన్నకాలువకు గండిపడి,తాత్కాలిక బాట కొట్టుకు పోయింది. దీంతో రెండు గ్రామాలమధ్య బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ముఖ్యంగా బడికి వెళ్లే చిన్నపిల్లలు ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిలోనే ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని "వాగు"దాటాల్సిన పరిస్థితి వస్తోంది. ప్రమాదం కాచుక్కూర్చున్న ఈరహదారిపై పిల్లలను బడికి పంపాలంటేనే తల్లిదండ్రులు వణికి పోతున్నారు. "ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని క్షణ క్షణం నరకం చూస్తున్నాం" అని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ?సమస్య తీవ్రత ఇన్నిరోజులుగా కళ్లముందే కనిపిస్తున్నా సంబంధిత అధికారులుమాత్రం కనీసం ఆవైపు కన్నెత్తి చూడకపోవడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏక్షణమైనా ఘోరం జరిగే ప్రమాదంఉందని హెచ్చరిస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి తాత్కాలికంగా రాకపోకలకు వీలుగా తాత్కాలిక రహదారి ఏర్పాటు చేయాలని,అలాగే భవిష్యత్తులో ఈతిప్పలు తప్పేలా శాశ్వతవంతెన నిర్మించాలని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకొంటున్నారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన బాట పడతామని హెచ్చరిస్తున్నారు. ఇరు గ్రామస్తులు కుంజ బుజ్జి, జల్లి రామయ్య,అప్పారావు, మడివి శ్రీలత,గుంజ రాజయ్య భద్రయ్య,సుబ్బమ్మ,వినోద్ మడివి సుబ్బయ్య,తదితరులు పాల్గొన్నారు

## జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ నాగరాణి బాధ్యతలు



**భీమవరం సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని జిల్లా రెవెన్యూ అధికారి పి. గ్లోరియ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారిగా నూతన బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ నాగరాణికి జిల్లా అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా పరిషత్ పరిధిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంలో అధికారుల సమన్వయం కీలకమని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా

# యువత భవితకు భరోసా' కార్యక్రమంలో విద్యార్థులతో ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి ముఖాముఖి

**ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 26(ప్రజా జ్యోతి ):**పట్టణం లోని వైష్ణవి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన 'యువత భవితకు భరోసా' కార్యక్రమంలో ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికారు. విద్యార్థులతో ఎమ్మెల్యే గారు ముఖాముఖిగా మాట్లాడి నాణ్యమైన విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగాలు మరియు భవిష్యత్ కెరీర్ అవకాశాలపై అవగాహన కల్పించారు విద్యా వ్యవస్థలో సాంకేతికతను మరింతగా వినియోగిస్తూ విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు మంత్రి శ్రీ నారా లోకేష్ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలను వివరించారు. గ్రామీణ యువతకు స్కిల్ డెవలప్‌మెంట్, టెక్నాలజీ, ఏ ఐ రంగాల్లో శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఉద్యోగ క్యాలెండర్, మెగా డీఎస్సీ, గ్రూప్--1 తదితర నియామక ప్రక్రియలను పారదర్శకంగా, క్రమబద్ధంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం విద్యార్థులతో ఎమ్మిగనూరు నియోజకవర్గ






అభివృద్ధిపై చర్చిస్తూ టెక్నాలజీ ట్రైనింగ్ హబ్, ఇంటిగ్రేటెడ్ హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్ పార్క్, మెరుగైన వైద్య సదుపాయాలు, రైతుబజార్, యువత--క్రీడలకు ప్రోత్సాహం, ఆలయ సర్క్యూట్ టూరిజం, రోడ్ల అభివృద్ధి, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తదితర అంశాలను వివరించారు. "యువతే దేశ భవిష్యత్తు.. నేటి విద్యార్థుల ప్రతిభకు సరైన అవకాశాలు అందితే ఎమ్మిగనూరు యువత జాతీయ స్థాయిలో రాణించగలదు" అని ఎమ్మెల్యే అన్నారు. ఎమ్మెల్యే ప్రోత్సాహం, మార్గదర్శకత్వం మరియు అవగాహన కార్యక్రమానికి కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ గాడిగె లింగప్ప, కరస్పాండెంట్, ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు, టీడీపీ స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు బోధనతో పాటు సమాజానికి దిక్సూచి కావాలి

**పాలకొల్లు. ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. సెప్టెంబర్ 26.** ఉపాధ్యాయులు విద్యాబోధనతో పాటు పాఠశాల అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేస్తూ సమాజానికి దిక్సూచి కావాలని అటువంటి వారిలో వలవల యజ్ఞ ప్రసాద్ ఒకరని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిశెట్టి క్రాంతి కుమార్ అన్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన మట్లపాలెం స్కూల్ అసిస్టెంట్ వలవల యజ్ఞ ప్రసాద్, ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా పాలకొల్లు లైన్స్ క్లబ్ వారిచే సన్మానం పొందిన స్కూల్ అసిస్టెంట్,కె చలపతిరావు లను యలమంచిలి జిల్లా పరిషత్ ఉన్నత



పాఠశాల నందు శనివారం జరిగిన సన్మాన సభలో ఉపాధ్యాయ బృందం శాలువాలతో పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సభాధ్యక్షులు సిహెచ్.వి. సురేష్ బాబు మాట్లాడుతూ ఉపాధ్యాయులు యజ్ఞప్రసాద్ పని చేసిన పెనుమదం ,గుంపర్రు మట్లపాలెం, ఉన్నత పాఠశాలలలో విద్యార్థుల యొక్క ఎన్రోల్మెంటు పెంచడంలోనూ, విద్యా ప్రమాణాలు పెంపొందించడంలోనూ, మండల, జిల్లా స్థాయి ప్రథమ ర్యాంకులు సాధించడంలోనూ ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. పనిచేసిన ప్రతి పాఠశాలలోనూ విద్యార్థుల సౌకర్యం కోసం విద్యా ప్రమాణాలు పెంపొందించడం కోసం వనరులు దాతల నుండి, పూర్వ విద్యార్థుల నుండి సేకరించి ఎంతో అభివృద్ధి చేశారన్నారు. యజ్ఞ ప్రసాద్ పనిచేసిన అన్ని పాఠశాలలోనూ తనదైన ముద్రను వేసుకోవటం అభినందనీయమని అన్నారు. పాఠశాల అభివృద్ధిలో సమాజ భాగస్వామ్యాన్ని చేయడంలో వారు విజేతగా నిలిచారని ఈ అవార్డు వారికీ రావడం సముచితం అని ప్రశంసించారు. నేటి యువతరం ఉపాధ్యాయులు యజ్ఞప్రసాద్ ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. డిస్టిక్ రిసోర్స్ పర్సన్ శ్రీ డి గోపాలకృష్ణ మాట్లాడుతూ యజ్ఞప్రసాద్ రాబోయే రోజుల్లో రాష్ట్రస్థాయి అవార్డు పొందాలని అందుకు అర్హులని పేర్కొన్నారు. రిసోర్స్ పర్సన్ సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ యజ్ఞ ప్రసాద్ పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించడమే కాకుండా జిల్లా స్థాయిలో ఫస్ట్ ర్యాంక్ సాధించడం జిల్లా అవార్డు సాధించడం ఇంగ్లీషు ఉపాధ్యాయులు అందరికీ గర్వకారణమన్నారు. ఇరువురు ఉపాధ్యాయులను సన్మానించిన వారిలో సిహెచ్ వి సురేష్ బాబు, రిసోర్స్ పర్సన్స్ శ్రీ దంగేటి గోపాలకృష్ణ,శ్రీ సిహెచ్ శ్రీనివాస్, వి ఎస్ నాగలక్ష్మి, నార్ని మురళీకృష్ణ, నామన అశోక్ తదితరులు ఉన్నారు.

# ముంపు ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో ఎమ్మెల్యే కూన రవికుమార్ పర్యటన

## - ముంపుకు గురైన పంట పొలాలు పరిశీలన

## - పంట నష్టం పై తక్షణమే అంచనాలు వేయాలని అధికారులకు ఆదేశాలు





**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్ :** ఆర్నాబ్ తుఫాన్ నేపథ్యంలో పొందూరు మండలంలో ముంపుకు గురైన ప్రాంతాలలో రాష్ట్ర పి.యూ.సి చైర్మెన్ , ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ శనివారం నాడు పర్యటించారు. సింగూరు మొదలవలస బొడ్డేపల్లి గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి వరద నీటిలో మునిగిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు, గ్రామస్తులతో మాట్లాడి వరదల కారణంగా ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముంపు కారణంగా రైతులకు జరిగిన పంట నష్టాన్ని అధికారులు తక్షణమే అంచనా వేయాలని వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులను ఆదేశించారు. పంట నష్టానికి సంబంధించిన వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. అలాగే, వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు అధికార యంత్రాంగం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే కూన రవికుమార్ భరోసా కల్పించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ప్రజలకు అవసరమైన సహాయ చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు ఈ పర్యటనలో మండల వ్యవసాయ శాఖ ఏ .ఓ శ్రీనివాస బాబు ,టిడిపి జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కర రావు, బొడ్డేపల్లి మాజీ సర్పంచ్ సత్యం , టిడిపి నాయకులు , కార్యకర్తలు,అధికారులు ,రైతులు పాల్గొన్నారు.



# స్థానిక సమరానికి జనసేన సన్నద్ధం

### బాపట్ల నియోజకవర్గ ఎన్నికలపై మంత్రి పార్థసారథితో నామన వెంకట శివన్నారాయణ చర్చ



**బాపట్ల సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** బాపట్ల నియోజకవర్గ ఎన్నికల అంశాలపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథితో జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ చర్చించారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల పరిస్థితులు, పార్టీ పరంగా చేపట్టాల్సిన కార్యాచరణ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గంలో పార్టీ పరంగా అనుసరించాల్సిన విధానం, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం, ఎన్నికలకు సంబంధించిన అంశాలపై చర్చ జరిగినట్లు తెలిసింది. నియోజకవర్గంలో ప్రస్తుత పరిస్థితులను మంత్రి పార్థసారథి అడిగి తెలుసుకుని, ఎన్నికల ప్రక్రియకు అనుగుణంగా చేపట్టాల్సిన చర్యలపై సూచనలు చేసినట్లు సమాచారం. సమావేశంలో రేపల్లె ఏఎంసీ చైర్మన్ మత్తి భాస్కరరావు, శ్రీశైల దేవస్థానం బోర్డు సభ్యుడు ఆళ్ల అనిల్, సోమరౌతు అనురాధ పాల్గొన్నారు. నియోజక వర్గానికి సంబంధించిన పలు అంశాలపై నాయకులతో మంత్రి పార్థసారథి చర్చించారు.

# చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరి అరెస్ట్



**బేతంచెర్ల:సెప్టెంబర్26(ప్రజా జ్యోతి)**మహిళ మెడలోని బంగారు చైన్‌ను అపహరించిన కేసులో ఇద్దరు నిందితులను బేతంచెర్ల పోలీసులు అరెస్టు చేసి, చోరీ సొత్తును రికవరీ చేశారు. నిందితులు నేరానికి ఉపయోగించిన పల్సర్ మోటార్‌సైకిల్‌ను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు.. ఈ నెల 23న మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో బేతంచెర్ల పట్టణానికి చెందిన మాలి సరస్వతి వీరారెడ్డి ఇంటి సమీపంలో నడుచుకుంటూ వెళ్తుండగా, ఇద్దరు వ్యక్తులు పల్సర్ మోటార్‌సైకిల్‌పై ఆమెను వెంబడించారు. అనంతరం ఆమె మెడలో ఉన్న బంగారు చైన్‌ను లాక్కొని పరారయ్యారు. బాధితురాలు అదే రోజు సాయంత్రం 4 గంటలకు బేతంచెర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీఐ డి. వెంకటేశ్వరరావు, ఎస్సై రమేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుల కదలికలపై సమాచారం సేకరించి, సిమెంట్‌నగర్ గ్రామం వెలుపల ఉన్న సుంకులమ్మ గుడి వద్ద నంద్యాల పట్టణం హరిజనవాడకు చెందిన ఆరంగుల మద్దిలేటి (26), ఆరంగుల మధుకుమార్ (22)లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి చోరీకి గురైన బంగారు చైన్‌ను రికవరీ చేయడంతో పాటు, నేరానికి ఉపయోగించిన పల్సర్ మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

# హోమ్ గార్డ్ వ్యవస్థ వెనుక ఇదీ అసలు కథ



**నంద్యాల:సెప్టెంబర్=26 ప్రజాజ్యోతి** హోమ్ గార్డు వ్యవస్థ అనేది 6, డిసెంబర్, 1946లో బొంబాయిలో పౌర కల్లోలాలు మరియు మతపరమైన అల్లర్లను నియంత్రించడంలో పోలీసులకు సహాయం చేయడానికి హోమ్ గార్డులను తీసుకున్నారు. తదనంతరం, శాంతిభద్రతల పరిరక్షణకు, వరదల, అగ్నిప్రమాదల నివారణ, కరువులు, అత్యవసరమైన పరిస్థితులు ఏర్పడినప్పుడు పోలీసులకు సహాయకుడిగా స్వచ్ఛంద పౌరుల దళం అని పరంతి రక్షాధక్ష అని పశ్చిమ బెంగాల్, విలేజ్ గార్డ్స్, సివిక్ గార్డ్స్ కొన్ని రాష్ట్రాలు ఆమోదించాయి. 1962లో చైనా దురాక్రమణ నేపథ్యంలో కేంద్రము, రాష్ట్ర ప్రభుత్వాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాలు తమ ప్రస్తుత స్వచ్ఛంద సంస్థలను ఏకం చేయాలని సూచించింది. అప్పుడు హోమ్ గార్డ్స్ గా పిలువబడే ఆల్ ఇండియా ఫోర్స్ గా ఏర్పడింది.?ఈ హోమ్ గార్డ్స్ సర్వీస్ పెరిగి, హోమ్ గార్డులు కూడా పోలీసులకు ఏమాత్రం తేడా లేకుండా పోలీసులతో సమానంగా 24 గంటలు అన్ని విధులు నిర్వహిస్తున్నాము, అలాగే అన్ని బందబస్తులు, ట్రాఫిక్ లో, నైట్ బీట్ లు, అన్ని పోలీస్ విభాగాలలో పోలీస్ లతో సమాన విధి నిర్వహిస్తురు. విధి నిర్వహణలో ఎంతో మంది హోమ్ గార్డులు కూడా బలిఅయ్యారు. నేడు! హోమ్ గార్డ్స్ వ్యవస్థ పెరిగి నేడు దేశవ్యాప్తంగా 5లక్షల చేరుకుంది. నేడు 5లక్షల హోమ్ గార్డులు కనీస సౌకర్యాలు లేక హోమ్ గార్డుల కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరముగా ఉన్నది. భారతదేశంలో హోమ్ గార్డు వ్యవస్థ ఉన్నది. ఆ రాష్ట్రంలో ఈలా చేశారు, ఈ రాష్ట్రంలో ఇలా చేశారు, అని చెప్పుకోవడమే తప్ప, ఏ రాష్ట్రంలో కూడా హోమ్ గార్డులకు పూర్తిస్థాయిలో చేసింది లేదు. గౌరవనీయులైన ప్రధానమంత్రిగారికి గౌరవనీయులైన కేంద్ర హోంశాఖ మంత్రిగారికి నమస్కరిస్తూ, ఈ హోమ్ గార్డ్స్ వాలంటరీ అను చట్టాన్ని రద్దు చేయాలని హోమ్ గార్డ్స్ కు ఉద్యోగ హోదా కల్పించాలని మరియు హోమ్ గార్డ్స్ కు గ్రూప్–సి మరియు గ్రూప్–డి ఉద్యోగాలు ఇవ్వాలని ప్రార్థిస్తున్నాము. యావత్ భారతదేశంలో ఉన్న 5లక్షల పైన ఉన్న హోంగార్డుల కుటుంబాలు బాగుపడుతాయి.

## ఒటర మహాశయులారా ఒక్కసారి అలోచించుకోండ్డి



**నంద్యాల =సెప్టెంబర్:26 ప్రజాజ్యోతి** గెలిచేంతవరకు అందరూ నావాళ్లే, చెప్పేది అందరి మనిషిని అని, గెలిశాక ఓటువేసినోడు గేటుదగ్గర వేచి ఉండాలి, తనకులమోడీకి, తన బందువుకు సపరేటు కుర్చీ, రూమ్ సపరేటు అందుకే ఓటు వేసే ముందు ఆలోసించు నాయకుడని దండలతో టపాకాయలు, శాలువాలు వేస్తావ్ నీ ఖర్చుతో కానీ గెలిచాక నీ సమస్యలు దేవుడెరుగు, ఆ నాయకుని కులమోడు ఇతర పార్టీలో ఉన్నా వాడి పని ఎంత కష్టమైనా చేసి పెడతాడు, నేను స్వయంగా చూసా అనుభవించా ఇంకొకటి గమనించు నువ్వు ఇతర పార్టీవారితో మాట్లాడితే నిన్ను నమ్మరు, దూరం పెడతారు, వాళ్ళు మాత్రం వాళ్ళ కులమోడు ఏ పార్టీలో ఉన్నా కలుస్తారు వాళ్ళు, వాళ్ళు వ్యాపారాలు చేసుకుంటారు, జనాలు చూసేందుకు విమర్శలు చేసుకుంటారు కానీ కొట్టుకోరు, మనం మాత్రం నాయకునికోసం కొట్టుకుంటాం, కేసులు పెట్టించుకుంటాం, ఆర్థికంగా నష్టపోతాం అందుకే తెలుసుకో పార్టీల జెండాలు మొయ్యటం మానుకో

## బైక్ పై నుండి రెండు లక్షల చోరి..




**ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి ):** పట్టణంలో రెండు లక్షల రూపాయల చోరీ కలకలం రేపింది. వైఎస్ఆర్ సర్కిల్ సమీపంలో ఒక రైతు కష్టపడి దాచుకున్న నగదును క్షణాల్లో దుండగుడు కాజేసి పరార య్యాడు. రైతు రంగారెడ్డి కెనరా బ్యాంకులో తన ఖాతా నుండి రూ.2 లక్షల నగదు విత్‌డ్రా చేసుకుని బయలు దేరాడు. అయితే, బ్యాంకు నుంచే అతనిపై కన్నేసిన ఓ అపరిచిత వ్యక్తి రంగారెడ్డిని నిశితంగా వెంబడించాడు. బ్యాంక్ నుండి వచ్చిన రైతు, వైఎస్ఆర్ సర్కిల్‌లోని లక్ష్మీ స్వీట్స్ షాప్ ముందు తన బైక్‌ను నిలిపి లోపలికి వెళ్లాడు. సరిగ్గా అదే సమయాన్ని ఆసరాగా చేసుకున్న దుండగుడు... క్షణాల వ్యవధిలో బైక్ ముందు ఉంచిన పెట్రోల్ ట్యాంక్ కవర్ లో ఉన్న రూ.2 లక్షల నగదును ఎత్తుకెళ్లిపోయాడు. షాప్ బయటకు వచ్చి చూసుకునేసరికి నగదు మాయమవ్వడంతో షాక్‌కు గురైన బాధితుడు రంగారెడ్డి, వెంటనే పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు కేసు నమోదు చేసుకుని, వైఎస్ఆర్ సర్కిల్ మరియు లక్ష్మీ స్వీట్స్ సమీపంలోని సీసీ కెమెరా ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. కెమెరా దృశ్యాల ఆధారంగా నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## మూడు మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం




**బేతంచెర్ల:సెప్టెంబర్26(ప్రజా జ్యోతి)**మండలంలో మూడు మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ జప్రుల్లా తెలిపారు. బేతంచెర్ల నగర పంచాయతీ పరిధిలో ఒకటి, గ్రామీణ ప్రాంతాల్లో రెండు దుకాణాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒక్కో దుకాణానికి దరఖాస్తు రుసుము రూ.3 లక్షలు, స్లాబ్ ప్రకారం రూ.60.50 లక్షలు, పర్మిట్ రూమ్‌కు రూ.5 లక్షలు, ప్రాసెసింగ్ ఫీజుగా రూ.1,000 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. అక్టోబర్ 1లోపు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. దరఖాస్తులపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ కార్యాలయాల్లో పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుత లైసెన్స్‌దారులు, కొత్తగా దరఖాస్తు చేసుకునే వారితో సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై సోమశేఖర్, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో అన్నసంతర్పణ

--వినాయక నవరాత్రుల్లో అన్నదానం.

--పోలూరు,మోతుగూడెం గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు.





**మోతిగూడెం ప్రజాజ్యోతి సెప్టెంబర్ 26 :** శ్రీ వరసిద్ధి వినాయకుని నవరాత్రుల సందర్భంగా శనివారం శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో అన్నసంతర్పణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజినీర్ రాజారావు, సూపరింటెండెంట్ ఇంజినీర్లు బాలకృష్ణ, చిన్న కామేశ్వరరావు, డీఈటీ వరప్రసాద్, ఎస్ఏఓ ప్రసాద్, సివిల్ ఈఈ బాలసుబ్రమణ్యం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పోలూరు, మోతుగూడెం గ్రామాలతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమం ప్రశాంతంగా కొనసాగేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టారు.

# కేజీబీవీ విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యం







**నూతన భవనాన్ని నిర్మించిన ఎమ్మెల్యే బీవీ..**

**నందవరం, సెప్టెంబర్ 26(ప్రజా జ్యోతి ):**కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) విద్యార్థుల సంక్షేమం, విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. నందవరం కేజీబీవీలో నూతనంగా నిర్మించిన అదనపు భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పాఠశాలకు ప్రహరీ గోడ లేకపోవడంతో పాములు, కుక్కలు, పశువులు లోపలికి వస్తున్నాయని విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, త్వరలోనే ప్రహరీ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదనపు గదులు అందుబాటులోకి రావడంతో విద్యార్థులకు మరింత సౌకర్యం కలుగుతుందని ఎమ్మెల్యే బీవీకి ప్రత్యేక కృతజ్ఞతలు ప్రిన్సిపల్ శైలజ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ గోవిందు, రఘునాథరెడ్డి, టీడీపీ మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మాధవరావు దేశాయ్, టీడీపీ మండల అధ్యక్షుడు కాసింవలి, సొసైటీ చైర్మన్ ధర్మపురం గోపాల్, టీడీపీ సీనియర్ నాయకులు ఈరన్న గౌడ్,రైస్ మిల్ నారాయణరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో సందీప్,ఏపీవో శ్రీనివాసులు కనకవీడు రఘుమూర్తిస్వామి,భార్గవ్ యాదవ్, టీడీపీ నాయకులు భీమశేఖర్, మస్తాన్, వడ్డే గోపాల్, మల్లప్పగౌడ్ ఈసా పాల్గొన్నారు. అధికారులు, టీడీపీ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏరిగేరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓపెన్ టెన్త్ మరియు ఓపెన్ ఇంటర్ కొత్త అడ్మిషన్లకు సువర్ణ అవకాశం...హెచ్ఎం రమేష్ నాయుడు






**కౌతాళం,సెప్టెంబర్ 26 ప్రజా జ్యోతి** కౌతాళం మండల పరిధిలోని ఏరిగేరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఓపెన్ టెన్త్ మరియు ఓపెన్ ఇంటర్ అడ్మిషన్స్‌కు సువర్ణావకాశం చదువు మధ్యలో ఆగిపోయిన వారు, వివిధ కారణాల వల్ల రెగ్యులర్ విద్యను కొనసాగించలేకపోయిన వారు తమ విద్యాభ్యాసాన్ని తిరిగి కొనసాగించేందుకు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (అపాస్) ఆధ్వర్యంలో ఈ విద్యా సంవత్సరం నుండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎరిగేరి నందు ఓపెన్ టెన్త్ మరియు ఓపెన్ ఇంటర్మీడియట్ కోర్సులకు అడ్మిషన్స్ స్వీకరించబడును. ఓపెన్ టెన్త్ 10వ తరగతి విద్యను పూర్తి చేయాలనుకునే అభ్యర్థులకు అవకాశం ఓపెన్ ఇంటర్మీడియట్ ఇంటర్మీడియట్‌లో ఆర్ట్స్ గ్రూపుకు మాత్రమే అడ్మిషన్స్ స్వీకరించబడును. రెగ్యులర్ విద్యకు దూరమైనవారు, ఉద్యోగం లేదా ఇతర బాధ్యతల కారణంగా చదువును కొనసాగించలేకపోయినవారు,తమ విద్యార్హతలను పెంపొందించుకోవాలనుకునే ప్రతి ఒక్కరూ ఈ అద్భుతమైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాము. "చదువుకు వయస్సు అడ్డంకి కాదు విద్యను కొనసాగించేందుకు ఇదే మీకు మరో అవకాశం!" అర్హత,అడ్మిషన్ వివరాలు మరియు ఇతర సమాచారం కోసం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎరిగేరిను సంప్రదించగలరనీ జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.రమేష్ నాయుడు ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.

# రీ సర్వేతో భూములకు శాశ్వత పరిష్కారం..!

డివిజనల్ సర్వేయర్ బసవరాజయ్య,

మండల సర్వేయర్ ఈశ్వర్ ప్రసన్న

గజ్జెహళ్లి గ్రామంలో రీసర్వే -గ్రామసభ

అవగాహన ర్యాలీ...!







**హొళగుంద,సెప్టెంబర్ 26, ప్రజా జ్యోతి న్యూస్ –** రీ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని డివిజనల్ సర్వేర్ బసవరాజయ్య , మండల సర్వేయర్ ఈశ్వర్ ప్రసన్న, వీఆర్వో ప్రహ్లాద్ అన్నారు. శనివారం హొళగుంద మండలం గజ్జహళ్లి గ్రామంలో సుమారు ఆరు వేల మూడు వందల తొంబై నాలుగు ఎకరాలపై రీ సర్వేపై గ్రామసభ ఢరైతులుకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బ్రిటిష్ కాలంలో భూములకు హద్దులు గుర్తించారని, వాటి ద్వారా అనేక సమస్యలు వస్తుండడంతో రాష్ట్ర ప్రభుత్వం రీ సర్వేకు శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతి రైతు ఈ సర్వేకు సహకరించాలని కోరారు. సోమవారం నుంచి భూమి రీ సర్వే ప్రారంభిస్తామన్నారు. పట్టా భూములు, సరిహద్దులు చూపిస్తామని చెప్పారు. అనంతరం వివిధ అంశాలపై అన్నదాతలతో చర్చించారు. రీ సర్వేకు రైతులందరూ సహకరించాలని కోరారు ఈ కార్యక్రమంలో డివిజనల్ సర్వేర్ బసవరాజయ్యా, మండల సర్వేర్ ఈశ్వర్ ప్రసన్న, వీఆర్వో ప్రహ్లాద్, విలేజ్ సర్వేర్లు దేవేంద్ర, రాజ్ కుమార్ గ్రామంలోని రైతులు పాల్గొన్నారు .

# తుఫాన్ ధాటికి విలవిలలాడుతున్న రైతన్నలు

- ఈదురుగాలులకు నేలమట్టమైన బొప్పాయి తోటలు
- ఎకరాల్లో పంట నష్టం
- లబోదిబోమంటున్న రైతులు
- ప్రభుత్వమే ఆదుకోవాలంటూ ఆవేదన



**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్ :**ఇటీవల సంభవించిన ఆర్నాబ్ తుఫాన్ రైతులను తీవ్రంగా దెబ్బతీసింది. ఈదురు గాలుల ధాటికి ఎకరాల కొద్దీ సాగు చేసిన బొప్పాయి చెట్లు వేళ్లతో సహా పెకలించుకుపోయి నేలమట్టమయ్యాయి. పంట చేతికి వచ్చే సమయంలోనే తుఫాన్ విరుచుకుపడటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. బొప్పాయి సాగు కోసం పెట్టిన వేలాది రూపాయల పెట్టుబడి కళ్లముందే నాశనం కావడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొందూరు మండలం తండ్యాం ,బాణం గ్రామాల్లో సుమారు 80 ఎకరాల బొప్పాయి సాగు దెబ్బతింది. బొప్పాయి సాగు కోసం విత్తనాలు ,ఎరువులు ,కూలీల ఖర్చులతో భారీగా పెట్టుబడులు పెట్టామని ,పంటపై ఆశలు పెట్టుకున్న సమయంలో తుఫాన్ కారణంగా చెట్లు నెలకొరగడంతో పెట్టుబడులు సైతం తిరిగి వచ్చే పరిస్థితి లేకుండా పోయిందని,బొప్పాయి పండును కొనే నాధుడే లేరని తండ్యాం మాజీ సర్పంచ్ కిలారి భాస్కర్ రావు ,పోతిరెడ్డి అప్పారావు, సకల నర్సింగ్ రావు, ఆలమూరు రమణ, బాధ అప్పారావు, సకల భాస్కరరావు, పోతిరెడ్డి మల్లేష్, వసంత్, కిలారి సూర్యరావు, వీటితో పాటు బొప్పాయి పంట వేసిన 40 మంది రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. .నష్టపోయిన తమను ప్రభుత్వమే ఆదుకోవాలని,వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు గ్రామాలను సందర్శించి, దెబ్బతిన్న బొప్పాయి తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పారదర్శకంగా నష్టం అంచనా వేయాలని రైతులు కోరుతున్నారు. ఎకరాకు లేదా హెక్టారుకు తగిన నష్టపరిహారం వెంటనే అందించడంతో పాటు, ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని, ప్రజాప్రతినిధులను రైతులు వేడుకుంటున్నారు.

## మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత



**బేతంచెర్ల, సెప్టెంబర్ 26:(ప్రజా జ్యోతి )**ప్రకృతిని ప్రేమిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందామని జడ్.పి.హెచ్. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మద్దిలేటి స్వామి అన్నారు. ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా బేతంచెర్ల మండలం ఆర్.కొత్తపల్లి గ్రామంలోని జడ్.పి.హెచ్. ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మద్దిలేటి స్వామి, గణిత ఉపాధ్యాయుడు మిద్దె నాగ శేషుడు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించి పెంచాలని సూచించారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం లభిస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు మంచి పర్యావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, మరియు విద్యార్థులు, గ్రామ పెద్దలు కుమ్మరి గురప్ప , నేతుల శేశి రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## చింతలూరు శ్రీ నూకాంబికా అమ్మవారికి కృష్ణా నది జలములతో అభిషేకం,కుంకుమార్చన పూజలు.



**ఆలమూరు సెప్టెంబర్ 26(ప్రజాజ్యోతి):**చింతలూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ నూకాంబికా అమ్మవారి ఆలయంలో శనివారం పౌర్ణమి పర్వదినం పురస్కరించుకొని పెద్దింటి మణికుమార్ శర్మ బ్రహ్మత్వంలో అమ్మవారికి కృష్ణా నది జలములతో అభిషేకం నిర్వహించి కుంకుమార్చన పూజలు చేయటం జరిగినది.నూతనముగా గత నెల పౌర్ణమి నుంచి ప్రవేశపెట్టబడిన ఈ సేవలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు శ్రీ అమ్మవారి అభిషేక దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందించడం జరిగినదని ఆలయ కార్యనిర్వహణాధికారి తెలియజేసారు.

## దుర్గాడ శివాలయంలో వైభవంగా శ్రీ లలితా దేవికి ఏకాదశ రుద్రాభిషేకం



**గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** దుర్గాడ గ్రామంలోని ప్రసిద్ధ శివాలయంలో స్వర్ణోత్సవ--బ్రహ్మోత్సవాలు (1976--2026) భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న 108 రోజుల భజనా మహాయజ్ఞం శనివారంతో 35వ రోజుకు చేరుకుంది. భాద్రపద మాస పూర్ణిమను పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు సోదరుల ఆధ్వర్యంలో శ్రీ లలితాదేవి అమ్మవారికి ఏకాదశ రుద్రాభిషేకం శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం అమ్మవారిని నూతన వస్త్రాలతో విశేషంగా అలంకరించారు. ఈ పూజా కార్యక్రమాల్లో మహిళలు పాల్గొని సామూహికంగా లలితా సహస్రనామ కుంకుమార్చన చేశారు.అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి ప్రత్యేక హారతులు ఇచ్చారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ సేవా సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్వర్ణోత్సవ--బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో జరుగుతున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోందని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

## మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ను మర్యాదపూర్వకంగా కలిసిన జనసేన నేత యనమల భాస్కర్

### త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలపై సుదీర్ఘ చర్చ



నంద్యాల సెప్టెంబర్ 26: ప్రజాజ్యోతి నంద్యాల మంత్రిగారి క్యాంపు కార్యాలయం నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ను, తెలుగుదే శం పార్టీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండీ ఫయాజ్ ను జనసేన పార్టీ స్థానిక సంస్థల రాష్ట్ర సమన్వయ కమిటీ కోఆర్డినేటర్ యనమల భాస్కర్ మర్యా దపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలు, నంద్యాల నియోజకవర్గ పరిధిలోని పలు అంశాలపై వారు చర్చించారు. ముఖ్యంగా త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాలు, కూటమి సమన్వయం, క్షేత్రస్థాయిలో పార్టీల బలోపేతం తదితర అంశాలపై నేతల మధ్య కీలక చర్చ జరిగింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా ముందుకు సాగాలని ఈ సందర్భంగా తెలిపారు .ఈ సమావేశంలో పిడతల సుధాకర్, పబ్బతి రవి, రాచమడుగు చందు , సుందర్, సురేష్, మల్లయ్య, సురేఖ, రాంబాబు మరియు జనసేన నంద్యాల జిల్లా ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# శంఖవరం ప్రజల ప్రశాంత జీవనం కోసమే రిలే నిరాహార దీక్ష - ముద్రగడ గిరిబాబు




ఉమ్మడి వెంకట్రావు, అంగూరి లక్ష్మీ శివకుమారి




పర్వత రాజబాబు



రిలే నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపిన ముద్రగడ గిరిబాబు

**శంఖవరం : సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి న్యూస్)** గ్రామా లంటేనే పచ్చని ప్రకృతి అందాలతో నిండిన వాతావరణానికి, ప్రజల ప్రశాంత జీవనానికి చిహ్నాలుగా నిలుస్తాయి. అటువంటి పల్లెలు నేడు మైనింగ్ మాఫియా చేతిలో నిలువు దోపిడీకు గురవుతూ... పల్లెల ప్రశాంత జీవన విధానాన్ని మైనింగ్ తరలించే టిప్పర్లు దుమ్ము, ధూళితో అస్తవ్యస్తం చేస్తున్నాయి. దీనితో విసిగి వేసారిపోయిన కొందరు యువకులు పార్టీలకతీ తంగా శంఖవరం గ్రామ అభివృద్ధి సేవా సంఘం పేరుతో ఒక కమిటీని ఏర్పాటు చేసి, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులకు శంఖవరం గ్రామం మీదుగా టిప్పర్ల రాకపోకలను నిలుపు చేయండని పలుమార్లు పిర్యాదులు చేసారు. కాని వాటికి నేటి వరకు ఎటువంటి సమాధానం లేకపోగా ఈ మార్గంలో మరిన్ని టిప్పర్లు పెరిగిపోయాయి. ఇక చేసేదేమీ లేకపోవడంతో శంఖవరం గ్రామ అభివృద్ధి సేవా సంఘం ఐదు రోజుల పాటు రిలే నిరాహార దీక్షను శాంతియుతంగా చేపట్టి ప్రభుత్వానికి తమ గళం వినిపించాలని నిర్ణయించింది. గడిచిన శుక్రవారం ప్రారంభించిన దీక్ష విజయవంతం కావడంతో నేడు (శనివారం) రెండో రోజుకు చేరుకుంది. రెండో రోజు దీక్షా శిభిరాన్ని తాజా మాజీ ఎంపీపి పర్వత రాజబాబు హాజరై, తన సంఘీబావం తెలిపి, గడిచిన కొన్నేళ్ళుగా శంఖవరం గ్రామం మీదుగా నడుస్తున్న టిప్పర్ల వల్ల ప్రజలు తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నారని, ఈ టిప్పర్లకు బైపాస్ రహదారి నిర్మించినప్పుడే శంఖవరం ప్రజలకు ఉపశమనం కలుగుతుందన్నారు. బైపాస్ రహదారి నిర్మాణం విషయంలో రైతులతో చర్చించేందుకు తాను ఎప్పుడూ అందుబాటులోనే ఉంటానన్నారు. అనంతరం దీక్షా శిభిరానికి ప్రత్తిపాడు వైసిపి ఇన్చార్జ్ ముద్రగడ గిరిబాబు శంఖవరం మండలం పార్టీ శ్రేణులతో చేరుకుని దీక్షలో రెండవ రోజు కూర్చున్న మహిళలకు, సేవా సంఘం సభ్యులకు తమ సంఘీబావం ప్రకటించారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ శంఖవరం గ్రామ ప్రజలు అసాధ్యమైన కోర్కెలు కోరడం లేదని, ప్రజలు వారి బిడ్డల భవిష్యత్తు కోసం, స్వచ్ఛమైన గాలి కోసం కష్టపడి కట్టుకున్న గృహాలు వది కాలాల పాటు ఉండాలని, వారు కుటుంబం ప్రశాంతంగా బ్రతకడం కోసమే శంఖవరంలో ఉద్యమం ప్రారంభమైనదన్నారు ప్రజల ఆవేదనను, బాధను తాము అర్థం చేసుకున్నామని, ఈ ఉద్యమం సఫలం కావాలంటే గ్రామంలో ప్రతీ ఒక్కరూ కదిలి వచ్చి ఉద్యమానికి బాసటగా నిలవాలన్నారు. మీరంతా ముందడుగు వేస్తే... మీ వెనుక వైసిపి పార్టీ అండగా నిలుస్తుందని గిరిబాబు భరోసా నిచ్చారు. సమస్య ప్రతీ ఒక్కరిదీ. అంతా సమైక్యంగా పోరాడాల్సిన సమయం వచ్చింది. లేనిపక్షంలో ఇలానే టిప్పర్లు తిరుగుతుంటే కొన్ని రోజుల్లో నేడు గ్రామాలు, తర్వాత మండలాలు ఖాళీ అవుతాయన్నారు. తాము అభివృద్ధికి వ్యతిరేకం కాదని, కాని అభివృద్ధి పేరుతో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తూ చేసేది అభివృద్ధి కాదని, ఆది అరాచకమన్నారు. ప్రతీ ఒక్కరు ప్రశ్నించినప్పుడే ప్రభుత్వాలు దిగి వస్తాయన్నారు. ఈ రిలే నిరాహార దీక్షకు సోమవారం ఉదయం నుండి తాను, వైసిపి పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో పాల్గొంటామని, టిప్పర్ల సమస్యను అధిగమించేందుకు బైపాస్ రహదారి నిర్మించుకునే వరకు ఉద్యమం కొనసాగాలని, తాము అండగా ఉంటామన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఉమ్మిడి వెంకట్రావు దీక్ష శిభిరానికి చేరుకుని సంఘీబావం తెలిపి, తమ సంపూర్ణ మద్దతును తెలిపారు. ఇది 13 గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న అక్రమ మైనింగ్ ను తరలించే టిప్పర్లు సృష్టిస్తున్న తీవ్రమైన సమస్య అని, దీనిని ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలన్నారు. మాజీ కేంద్ర మంత్రి ఎంఎం పల్లంరాజు, జిల్లా అధ్యక్షుడు మాదేపల్లి సత్యనందరావు ఆదేశాలతో తాను వచ్చానని, త్వరలోనే వారు దీక్ష శిభిరానికి వచ్చి సంఘీబావం తెలుపుతారన్నారు. మాజీ ఎమ్మెల్సీ, వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి అంగూరి లక్ష్మీ శివకుమారి దీక్షా శిభిరానికి చేరుకుని తమ సంఘీబావం తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీ శివ కుమారి మాట్లాడుతూ ఈ రిలే నిరాహార దీక్షలో మహిళలు పాల్గొనడం సమస్య తీవ్రతరాన్ని గుర్తు చేస్తుందన్నారు. ప్రభుత్వం దిగి వచ్చే వరకు ఈ ఉద్యమం కొనసాగాలన్నారు. తాను కూడా సోమవారం గిరిబాబుతో పాటు దీక్షలో పాల్గొంటానన్నారు. సంఘీభావం తెలిపిన వారిలో వైసిపి నేతలు గౌతు వాసు, అడపా సోమేష్, నరాల శ్రీను, సకురు గుర్రాజు, గౌతు రోహిత్, చల్లా సత్యప్రసాద్, సప్పా రాంబాబు, వెలుగుల రవి ఉన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మేకల కృష్ణ, ఉపాధ్యక్షుడు గునపర్తి అపురూప్, కార్యదర్శి పర్వత రామకృష్ణ, సభ్యులు పగడాల బాబ్జి, గుద్దాటి నాగేశ్వరరావు, బొమ్మిడి చిట్టిబాబు, బొర్రా సత్తిబాబు, కొంగు రమేష్, రేలంగి వెంకట సత్యనారాయణ, పడాల కృష్ణమూర్తి, బత్తిన తాతాజీ, గ్రామ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు,

# ప్రతిభకు ప్రోత్సాహం.. విద్యార్థులకు పురస్కారాలు







**కంబదూరు సెప్టెంబర్:26 (ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్, కంబదూరు:** మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలోని జయం ఆదెప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తిమ్మాపురం సేవా మందిరం పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సేవా మందిరం పూర్వ విద్యార్థుల కమిటీ సెక్రెటరీ జి. రవీంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆ పాఠశాలలో ఆరవ తరగతి నుంచి పదో తరగతి వరకు మరియు పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన, విద్యార్థులకు ప్రతిభ పురస్కారాల ప్రోత్సాహం అందజేశారు.ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. చదువుతో పాటు క్రమశిక్షణ, సమయపాలన, పట్టుదల, మంచి నడవడికను అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ ప్రతిభను గుర్తించి మరింతగా అభివృద్ధి చేసుకోవాలని, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు.విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, ఇతర విద్యార్థులకు కూడా స్ఫూర్తి కలుగుతుందని పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ప్రోత్సాహానికి పూర్వ విద్యార్థులు తమ వంతు సహకారం అందిస్తారని తెలిపారు.అనంతరం ఆ పాఠశాలలో ఆరవ తరగతి నుంచి పదో తరగతి వరకు మరియు పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన, విద్యార్థులను పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు అభినందించి ప్రోత్సాహం పురస్కారాలను అందజేశారు. పురస్కారాలు అందుకున్న విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు, మారుతి ప్రసాద్, కే. ఎల్. వెంకటేశులు, విరుపాక్ష, మెడికల్ స్టోర్ రవి, ఈ తీర్థ ప్రసాద్, ఈశ్వరయ్య, రాజేంద్రప్రసాద్, శ్రీకాంత్, నరేష్, గంగాధర్, తదితర కమిటీ సభ్యులు మరియు విద్యార్థులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక విగ్రహాల నిమ్మజ్జనం ఊరేగింపులో జాగ్రత్తలు పాటించాలి

### :కమిటీలకు ఆలమూరు ఎస్సై నరేష్ సూచనలు.

**ఆలమూరు సెప్టెంబర్ 26(ప్రజాజ్యోతి):**డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అడిషనల్ ఎస్పీ వారి ఆదేశాలతో, కొత్తపేట డిఎస్పీ వారి సూచనలు మేరకు ఆలమూరు మండలం మూలస్థానం గ్రామంలో శనివారం జరిగిన వినాయక విగ్రహాల నిమ్మజ్జనం ఊరేగింపులో జాగ్రత్తలు పాటించాలని ఉత్సవ కమిటీల నిర్వాహకులకు ఆలమూరు ఎస్సై జి.నరేష్ సూచనలు చేసారు.ఊరేగింపుల కారణంగా ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. డీజే సౌండ్స్‌ను అధిక శబ్దంతో వినియోగించకూడదని, పోలీసుల సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్సై సూచించారు.ఊరేగింపు సమయంలో యువత, భక్తులు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా శాంతియుతంగా వినాయక విగ్రహాల నిమ్మజ్జనం ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు.అలాగే విగ్రహాల నిమజ్జనం సమయంలో చెరువులు, కాలువలు, ఇతర నీటి వనరుల వద్ద భద్రతా చర్యలు పాటించాలని ఎస్సై నరేష్ సూచించారు. నిర్వాహకులు పోలీసులకు సహకరిస్తూ నిమజ్జనం కార్యక్రమాన్ని సజావుగా పూర్తి చేయాలని ఎస్సై నరేష్ కోరారు. కార్యక్రమం ఆలమూరు పోలీసు సిబ్బంది నిరంతరం నిఘాతో, ఉత్సవ కమిటీ సభ్యుల సహకారంతో నిమ్మజ్జన కార్యక్రమం సాయంకాలానికి ప్రశాంతంగా ముగిసినది.



# గొల్లప్రోలులో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ క్షేత్రస్థాయి పరిశీలన

## ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారానికి చర్యలు

## తగ్గుముఖం పట్టిన తర్వాత పంట నష్టం అంచనా: జిల్లా వ్యవసాయ అధికారి తారక రామారావు





**గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** గొల్లప్రోలు మండలంలో అకాల వర్షాల వల్ల ఏర్పడే నీటి ముంపు, నీటి ఎద్దడి సమస్యల నివారణకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ స్పష్టం చేశారు. శనివారం మధ్యాహ్నం ఆయన జిల్లా వ్యవసాయ అధికారి వి. తారక రామారావుతో కలిసి గొల్లప్రోలు మండలంలో విస్తృతంగా పర్యటించి, క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు.ముందుగా గొల్లప్రోలులోని కొత్త కాలనీ వద్ద ఉన్న సుద్దగడ్డ కాలువ పరిస్థితిని జేసీ పరిశీలించారు. అనంతరం కాలువ నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారిన పెద్దింటి అమ్మతల్లి గుడి వద్ద ఉన్న బ్రిడ్జిని, అక్కడి నుండి ఆర్ఆర్‌బీ ట్యాంక్ వరకు ఉన్న పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గొల్లప్రోలు పట్టణ ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న ముంపు సమస్యపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, ఇక్కడి సమస్యలకు శాశ్వత పరిష్కారం కనుగొనేందుకు వీలుగా సంబంధిత డిపార్ట్‌మెంట్ నుండి తక్షణమే నివేదికలు తెప్పించుకుంటామని, పనుల అమలుకు త్వరలోనే అనుమతులు కోరతామని హామీ ఇచ్చారు.జిల్లా వ్యవసాయ అధికారి వి. తారక రామారావు మాట్లాడుతూ.. అకాల వర్షాల కారణంగా మునిగిన పంట పొలాల్లో నీరు తగ్గుముఖం పట్టిన వెంటనే పంట నష్టం అంచనా వేస్తామని తెలిపారు. ఇందుకోసం వ్యవసాయ, రెవెన్యూ, సర్వే శాఖల అధికారులతో ప్రత్యేక సంయుక్త బృందాలను ఏర్పాటు చేసి, పారదర్శకంగా సర్వే నిర్వహించి నష్టపోయిన రైతుల జాబితాను సిద్ధం చేస్తామని వెల్లడించారు.ఈ పరిశీలన కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి, స్థానిక రాజకీయ నాయకులు, రైతులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# వర్షాలు లేక ఎండిన పంటలు








**:-గొర్రెలు పశువుల గ్రాసంగా మార్చిన రైతు రాగప్ప,**

**:-పెట్టుబడి రాక వలసల బాట..**

**కౌతాళం, సెప్టెంబర్ 26 ప్రజా జ్యోతి** ఆంధ్ర కర్ణాటక సరిహద్దులో ఉన్న కౌతాళం మండలం బాపురం గ్రామంలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగు చేసిన పంటలు చేతికి రాకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆకాశం వైపు చూసి విసిగిపోయిన రైతులు,చివరకు పండని పంటను పశువుల మేతగా వదిలేస్తున్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి రాకపోవడంతో, జీవనోపాధి కోసం పొరుగు ప్రాంతాలకు వలస వెళ్లక తప్పడం లేదని మీడియా ముఖంగా పలువురు రైతులు కన్నీరుమున్నీరయ్యారు.కౌతాళం మండలం బాపురం గ్రామానికి చెందిన రాగప్ప అనే రైతు తెలిపిన వివరాల ప్రకారం ఇటీవల ప్రభుత్వం సూచించిన విధంగా పంటల బీమా కోసం ఎకరాకు 2,000 రూపాయలు చొప్పున, అలాగే పత్తి పంటకు 360 రూపాయలు మిరప పంటకు నిర్ణీత ప్రీమియం మొత్తాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు చెల్లించారు. అయినప్పటికీ,ఈ బీమా పరిహారం సొమ్ము ఎప్పుడు ఖాతాల్లో జమ అవుతుందో తెలియక రైతాంగం తీవ్ర ఆందోళనలో కొట్టుమిట్టాడుతోంది."లక్షల రూపాయలు అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టాం. వర్షాలు లేక పంటలన్నీ ఎండిపోయాయి. కనీసం కోత ఖర్చులు కూడా వచ్చేలా లేవు. అందుకే పంటను పశువులకు వదిలేశాం.ఇక్కడ బ్రతికే దారి లేక, అప్పులు తీర్చడం కోసం ఊరు వదిలి వలస వెళ్తున్నాం. ఇన్సూరెన్స్ డబ్బులు ఎప్పుడు వస్తాయో అధికారులు స్పష్టత ఇవ్వాలి" అని ఓ బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి,పంట నష్టాన్ని అంచనా వేసి, కట్టిన బీమా సొమ్మును త్వరగా విడుదల చేయాలని, అలాగే వలసలను నివారించేందుకు తగిన సహాయక చర్యలు చేపట్టాలని ఆవేదన వ్యక్తం చేశారు.

# పెండెం దొరబాబుకు జనసేన నాయకుల ఘన సత్కారం

**పిఠాపురం(ప్రజా జ్యోతి)** జనసేన పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల కమిటీ సభ్యుడిగా నియమితులైన పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబుకు నియోజకవర్గ జనసేన నాయకులు, కార్యకర్తలు ఘనంగా అభినందనలు తెలిపారు.జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్ ఆశీస్సులతో దొరబాబును ఈ ఐదుగురు సభ్యుల కమిటీలో ఒకరిగా నియమించారు. ఈ నియామకం అనంతరం మంగళగిరి నుంచి కాకినాడలోని తన నివాసానికి చేరుకున్న దొరబాబును పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. శాలువాలు కప్పి, పూలమాలలతో ఆయనను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఆయనను కలిసిన వారిలో జనసేన నాయకులు మచ్చ అప్పాజీ,





తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, మారిశెట్టి బుజ్జి, దేవరపల్లి చినబాబు, చెల్లుబోయిన సతీష్, ఉమ్మిడి జాను ఉన్నారు. అలాగే జనసేన మత్స్యకార విభాగం నాయకులు వంకా కొండబాబు, వాడ్రేవు ధనబాబు, దాకే రాజ్‌కుమార్ తదితరులు దొరబాబుకు అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అప్పగించిన ఈ కీలక బాధ్యతలను ఆయన సమర్థవంతంగా నిర్వహించి, రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని నాయకులు ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

# అంగన్వాడి ఉత్సవంలో పోషణపై అవగాహన

**దువ్వూరు,సెప్టెంబర్ 26 ( ప్రజా జ్యోతి)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ (సెప్టెంబర్ పోషణ మాసం) మరియు సేవా కార్యక్రమాలలో భాగంగా 25 సంవత్సరాల సేవా సంకల్ప్ అభియాన్ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పోషణ్ ఉత్సవాలు మరియు అంగన్వాడీ ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుడిపాడు 3 అంగన్వాడీ కేంద్రంలో సూపర్వైజర్ సౌజన్య ఆధ్వర్యంలో నిర్వహించటం పాటు, సూపర్వైజర్ సౌజన్య మాట్లాడుతూ పోషకాహార అవగాహన గురించి గర్భిణులు, బాలింతలు మరియు చిన్న పిల్లలకు పౌష్టికాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం. అలాగే ఆరోగ్య పరీక్షలు మహిళలు, పిల్లలకు ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం గురించి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాల సేవలను గుర్తించి వారిని ప్రోత్సహించడం.స్థానిక ప్రదర్శనలు పౌష్టికాహార పదార్థాల తయారీ, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై ప్రదర్శనలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో గుడిపాడు ఎం.పీ.పీ స్కూల్ హెడ్మాస్టర్ శ్రీనువాసుల రెడ్డి, గర్భవతులు ,బాలింతలు, పిల్లలు,తల్లిదండ్రులు,ఆశ వర్కర్, అంగన్వాడి టీచర్లు రమాదేవి, లక్ష్మీ, రాదా,ఆయా బాలనాగమ్మ పాల్గొన్నారు.



## మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ను మర్యాదపూర్వకంగా కలిసిన జనసేన నేత యనమల భాస్కర్‌లి

### త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలపై సుదీర్ఘ చర్చలి




**నంద్యాల సెప్టెంబర్ 26: ప్రజాజ్యోతి** నంద్యాల మంత్రిగారి క్యాంపు కార్యాలయం నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ను, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండీ ఫయాజ్ ను జనసేన పార్టీ స్థానిక సంస్థల రాష్ట్ర సమన్వయ కమిటీ కోఆర్డినేటర్ యనమల భాస్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలు, నంద్యాల నియోజకవర్గ పరిధిలోని పలు అంశాలపై వారు చర్చించారు. ముఖ్యంగా త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాలు, కూటమి సమన్వయం, క్షేత్రస్థాయిలో పార్టీల బలోపేతం తదితర అంశాలపై నేతల మధ్య కీలక చర్చ జరిగింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా ముందుకు సాగాలని ఈ సందర్భంగా తెలిపారు .ఈ సమావేశంలో పిడతల సుధాకర్, పబ్బతి రవి, రాచమడుగు చందు , సుందర్, సురేష్, మల్లయ్య, సురేఖ, రాంబాబు మరియు జనసేన నంద్యాల జిల్లా ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## గొల్లప్రోలులో వరద బాధితులకు అండ భోజన పంపిణీ



**గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** 'అర్నబ్' తుఫాను సృష్టించిన బీభత్సానికి గొల్లప్రోలు పట్టణం జలమయమైంది. వరద ప్రవాహం పోటెత్తడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న బాధితులకు ప్రభుత్వం, అధికారులు అండగా నిలిచారు. కాకినాడ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని వరద ప్రభావిత ప్రాంతాలైన ఎస్సీ కాలనీ, ఎండీ కాలనీల్లో బాధితులకు ఉచిత భోజన పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.వరద నీరు ఇళ్లలోకి చేరడంతో వంట చేసుకునే పరిస్థితి లేని కాలనీ వాసుల కోసం అధికారులు ప్రత్యేకంగా మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో రుచికరమైన భోజనాన్ని సిద్ధం చేయించారు. ఈ భోజన పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ స్వయంగా దగ్గరుండి పర్యవేక్షించారు. బాధితులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగిస్తున్నట్లు ఈ సందర్భంగా అధికారులు వెల్లడించారు.

## ముదునూరికి పితృవియోగం.. ఫోన్లో పరామర్శించిన వైఎస్ జగన్

**--మురళీ కృష్ణంరాజుకు ధైర్యం చెప్పిన మాజీ సీఎం వైఎస్ జగన్..**


**--పలువురు ప్రముఖుల నివాళులు**



**కాకినాడ జిల్లా సెప్టెంబర్ 26(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి,నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీ కృష్ణంరాజుకు పితృవియోగానికి గురయ్యారు.మండలంలోని ధర్మవరంలో నివాసముంటున్న మురళీ కృష్ణంరాజు తండ్రి ముదునూరి రామరాజు (87) శనివారం ఉదయం అస్వస్థతకు గురై ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందారు.ఆయనకు ట్రస్ట్ వైస్ చైర్మన్ ముదునూరి సీతారామరాజు,మురళీ కృష్ణంరాజుతో పాటు ఐదుగురు కుమార్తెలు సంతానం.రామరాజు మృతి విషయం తెలుసుకున్న మాజీ ముఖ్యమంత్రి,వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మురళీకృష్ణరాజుకు ఫోన్లో పరామర్శించారు. తండ్రి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసి,కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.మురళీ కృష్ణంరాజుకు రామరాజు ఆరోగ్యం,మృతి వివరాలను అడిగి తెలుసుకున్నారు.కాగా ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు, మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీఎస్ఎన్ వర్మ,జ్యోతుల చంటిబాబు,మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీకుమారి తదితరులు ధర్మవరంలోని ముదునూరి నివాసానికి చేరుకుని రామరాజు భౌతికకాయాన్ని సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులర్పించి,మురళీకృష్ణరాజు కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో చోడవరం జడ్పీటీసీ దొండ రాంబాబు, అన్నవరం దేవస్థానం మాజీ పాలకమండలి సభ్యుడు బుద్ధరాజు గోపిరాజు, తాజా మాజీ ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్, మాజీ సర్పంచులు బెంతికుర్తి సుశీల, పుణ్యమంతుల కామరాజు, గ్రామ పెద్దలు బొల్లు కొండబాబు, దాట్ల అప్పన్నబాబు, పుణ్యమంతుల శ్రీను, బొండాడ నారాయుడు, బొల్లు నాగేశ్వరరావు, నిమ్మల నాని, బి చంటిరాజు, జువ్వల చినబాబు, బాబులు, కొండపల్లి అప్పారావు, దడాల సతీష్, ముప్పనబోయిన ఏసుబాబు, కోలా తాతబాబు, యాళ్ల ఏసుబాబు తదితరులు రామరాజు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.అనంతరం నియోజకవర్గం వ్యాప్తంగా పార్టీలకతీతంగా తరలివచ్చిన వందలాది మంది నాయకులు కార్యకర్తలు,అభిమానుల సమక్షంలో ముదునూరి వ్యవసాయ క్షేత్రంలో రామరాజు అంత్యక్రియలు నిర్వహించారు.

# అగ్రి జెనటిక్స్ కంపెనీ మిర్చి విత్తనాలతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం

**జీలుగుమిల్లి : 26 సెప్టెంబర్ జీలుగుమిల్లి : ప్రజాజ్యోతి రిపోర్టర్ (శివరామ్)** వేలేరుపాడు మండలంలోని చిగురు మామిడి, నార్లవరం గ్రామాలకు చెందిన మిర్చి రైతులు గత సంవత్సరం అగ్రి జెనటిక్స్ కంపెనీకి చెందిన మిర్చి విత్తనాలు సాగు చేసి నష్టపోయారు. ఈ నేపథ్యంలో బాధిత రైతులకు నష్టపరిహారం అందించేందుకు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు చొరవ తీసుకున్నారు. ఈ క్రమంలో 29 మంది రైతులకు చెందిన 47 ఎకరాల మిర్చి పంటకు సంబంధించి సుమారు రూ.14 లక్షల నష్టపరిహారాన్ని, కంపెనీ సహకారంతో శనివారం పోలవరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు బాధిత రైతులకు చెక్కుల రూపంలో అందజేశారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ, రైతులకు ఎటు వంటి ఇబ్బంది కలగకుండా వారి సమస్యలను పరిష్కరిం చేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. రైతులు నష్టపోయిన సమయంలో వారికి అండగా నిలిచి, న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవడం తన బాధ్యతగా భావిస్తున్నానని పేర్కొన్నారు. రైతుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి



తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి గంగాధరం, వేలేరుపాడు జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి మేచినేని సంజయ్, జనసేన నాయకులు బద్దుల శివరామ్ కుడియం భాను తదితరులు పాల్గొన్నారు.

# డోన్ వైయస్సార్ నాయకుల పైన టిడిపి క్లస్టర్లు ఇన్చార్జిలు సవాల్





**డోన్ (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 26** డోన్ వైయస్సార్ మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజారెడ్డి ముఖ్య అనుచరులు ముఖ్య నాయకులు పైన తెలుగుదేశం పార్టీ బూత్ ఇన్చార్జీలు, క్లస్టర్లు బిఎల్ఓ లు, సర్పంచులు శనివారం తెలుగుదేశం పార్టీ ఆఫీసు నందు ప్రెస్ మీట్ పెట్టి, డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర కార్యదర్శి వలస రామకృష్ణ ,జిల్లా ఉపాధ్యక్షులు సలింద్ర శ్రీనివాసులు గత వారం వైయస్సార్సీపి నాయకుల పైన మాట్లాడిన మాటలకు కౌంటర్ గా రెండు రోజుల క్రింద వైయస్సార్ పార్టీ ఎంపీపీరాజశేఖర్ రెడ్డి, జడ్పిటిసి రాజకుమార్, ముఖ్య నాయకులు, మాట్లాడిన మాటలకు టిడిపి క్లస్టర్లు ఇన్చార్జీలు మండల నాయకులు మల్లంపల్లి జయన్న, గోవింద్ రెడ్డి, కాగానుగుంట్ల బాలు, గోసానిపల్లె శ్రీరాములు, యాపదిన్నె రంగన్న, వలసల సుధాకర్, సీసం గుంతల గోవిందరాజులు, మిద్దపల్లె గోవిందు, మల్కాపురం రామాంజనేయులు, మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుండి రాజకీయాల్లోనే ఉండి వలసల రామకృష్ణ సెంటు భూమి కూడా సంపాదించుకోలేదు అవినీతికి పాలుపడలేదు, ఈరోజుకి కాలినడకతోనే నడుస్తూ నిజాయితీగా రాజకీయాలు చేస్తున్నాడు, కబ్జాలు చేయలేదు, లిక్కర్ మాఫియా అమ్మ లేదు, అంతేకాకుండా జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు వెంకటనాయనిపల్లె గ్రామానికి రెండు సార్లు సర్పంచ్ గా కొనసాగారు ఆయన మీద, అతని తమ్ముడు మీద అనవసరమైన మాటలు వ్యాపారమైన లేనిపోని అబద్ధాలతో రాద్ధాంతం చేస్తున్నారు ఉన్నది ఉన్నట్టు మాట్లాడితే ఎందుకు వైఎస్ఆర్ సీపీ నాయకులకు బాధ, మీలాగా ఖరీదైన కారులో తిరగలేదు, పెద్ద బంగ్లా కట్టలేదు, ఫ్యాక్టరీలు నడపలేదు అన్నిట్లోనూ అవినీతికి పాల్పడి సంపాదించలేదు, మీ పాలనంత దుర్యోధన పాలన జరిగింది, మాఎమ్మెల్యే ఉత్తమ నాయకుడు ప్రతిరోజు ప్రజల మధ్యఉంటూ ప్రజా శ్రేయస్సు కోరి వాళ్ళలో మమేకమై అక్కడికక్కడే అధికారులతో పరిష్కారం చేస్తున్నాడు, అధిష్టానంచెప్పిన విధముగా రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు వాళ్లకున్న అధికారంతో మీరు చేసిన తప్పులను ఎండగడితే ప్రెస్ మీట్ పెట్టి,దానికి ఉలికెందుకు, రామకృష్ణను, శ్రీనును,విమర్శించడం మీకు తగదు,మీకు చేతనైతే స్థానిక ఎలక్షన్లో పోటీ చేసి నీతిగా గెలిచి చూపించండి అంతేగాని మీలాగా నామినేషన్లు ఎవర్ని వెయ్యనీయకుండా ప్రజలుఓట్లు వెయ్యకుండా, మీరు గెలవకుండా హోదాను సంపాదించి ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారు,మీరు స్థానిక ఎలక్షన్లో గెలవండి అప్పుడు మాట్లాడండి అంతేగాని రాజకీయాలను దిగదార్చి ఇష్టాంసారంగా ప్రజలను భయభ్రాంతులను అయ్యేలా చేయకండి,అనవసరంగా, మీరు, మీ నాయకుడు బట్టను కాల్చి మొఖం మీద వేసినట్లు అబద్ధాలు చెప్పి రాజకీయాలను దిగదార్చకుండా ఉండాలని తెలిపారు,

# వరద ప్రాంతాల్లో తమ్మినేని సీతారాం పర్యటన







- నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి
- అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేయాలి : తమ్మినేని

**ఆమదాలవలస , ప్రజాజ్యోతి న్యూస్:** శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలంలో గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో ముంపునకు గురైన ప్రాంతాల్లో మాజీ స్పీకర్, వైఎస్సార్సీపీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు,జిల్లా పార్లమెంటరీ పార్టీ పరిశీలకులు తమ్మినేని సీతారాం,తమ్మినేని తనయుడు యువనేత తమ్మినేని చిరంజీవి నాగ్ పర్యటించారు అల్లిన, లక్కవరం, జి.బి.పురం, పెనుకుపర్తి గ్రామాల్లో పర్యటించిన ఆయన వరద ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులను పరామర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తమ్మినేని సీతారాం మాట్లాడుతూ వరదల కారణంగా కొన్ని వేల ఎకరాల్లో వరి పంటలు ముంపునకు గురై రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేయాలని, నష్టపోయిన రైతులకు తక్షణమే పంట నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే వరద ఉధృతికి పలు ప్రాంతాల్లో రహదారులు దెబ్బతిని రాకపోకలకు తీవ్ర అంత రాయం ఏర్పడిందని పేర్కొన్నారు. దెబ్బతిన్న రహదారులను అధికారులు వెంటనే పరిశీలించి యుద్ధప్రాతిపదికన మరమ్మ తులు చేపట్టాలని కోరారు. వరద బాధితులకు అవసరమైన సహాయాన్ని అందించి, రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తమ్మినేని సీతారాం డిమాండ్ చేశారు. పర్యటనలో గుమ్మడి రాంబాబు ,వైఎస్సార్సీపీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

# తుఫాన్ ముంపు ప్రాంతాల్లో పిసిని చంద్రమోహన్ పర్యటన

- దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి రైతులకు భరోసా
- నష్టపోయిన రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది

**ఆమదాలవలస ,ప్రజాజ్యోతి న్యూస్:** శ్రీకాకుళం జిల్లాలో తుఫాన్ ప్రభావంతో ముంపునకు గురైన ప్రాంతాల్లో జనసేన పార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. నాగావళి నది పరివాహక ప్రాంతాల్లో నీటిమట్టం భారీగా పెరగడంతో ముంపునకు గురైన గ్రామాలు, తీవ్రంగా దెబ్బతిన్న పంట పొలాలను ఆయన పరిశీలించారు. శ్రీకాకుళం, ఎచ్చెర్ల, ఆమదాలవలస నియోజకవర్గాల పరిధిలోని కిల్లిపాలెం, పొన్నాడ ప్రాంతాలతో పాటు బూర్జ మండలంలోని అల్లేన, నీలాదేవిపురం, పనుకుపర్తి, లక్కుపురం గ్రామాల్లో పిసిని చంద్రమోహన్ పర్యటించారు. ముంపు పరిస్థితులను స్వయంగా పరిశీలించి, రైతులు, గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తుఫాన్ కారణంగా పంటలు దెబ్బతినడంతో రైతులు ఎదుర్కొంటున్న నష్టాలను ఆయన



పరిశీలించారు. పంట నష్టం, ముంపు పరిస్థితులపై సమగ్ర నివేదికను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదల పవన్ కళ్యాణ్‌కు, జిల్లా అధికార యంత్రాంగానికి అందించి, బాధిత ప్రజలు, రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని చంద్రమోహన్ భరోసా ఇచ్చారు. ఈ పర్యటనలో జనసేన పార్టీ జిల్లా నాయకులు కొబగాపు గౌతమ్, చిట్టి భాస్కర్, పాకల కిషోర్, మత్స బుచ్చిబాబు, మురళీధర్ తదితరులతో పాటు ఆయా గ్రామాల ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

## సానా సతీష్ బాబును కలిసిన చదలవాడ బాబి,జోకా విజయకుమార్



**కాకినాడ జిల్లా సెప్టెంబర్ 26 (ప్రజాజ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** కాకినాడ రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు కార్యాలయంలో ఇటీవల జనసేన పార్టీలో చేరిన కిర్లంపూడి సొసైటీ మాజీ చైర్మన్ చదలవాడ బాబి, ప్రముఖ న్యాయవాది జోకా శ్రీనివాస విజయకుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీలో చేరిన చదలవాడ బాబీ, జోకా శ్రీనివాస విజయ కుమార్‌కు సానా సతీష్ బాబు శుభాకాంక్షలు తెలియజేశారు. కూటమి పార్టీల బలోపేతానికి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని కూటమి విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారికి తన పూర్తి సహకారం, అండదండలు ఉంటాయని సానా సతీష్ బాబు భరోసా ఇచ్చారు.

## బాలల హక్కుల పరిరక్షణకు సమష్టి కృషి



**బాపట్ల, సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** బాలల రక్షణ, సంరక్షణ, హక్కుల పరిరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మలత సూచించారు. జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా వివిధ బాలల సంరక్షణ కేంద్రాలు, పాఠశాలలను ఆమె సందర్శించారు. బాపట్లలోని ఆటిజం కేంద్రాన్ని పరిశీలించి పిల్లలకు అందుతున్న సౌకర్యాలు, సంరక్షణపై సిబ్బందితో చర్చించారు. అనంతరం నర్సాయిపాలెం గురుకుల బాలికల హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థులకు అందుతున్న ఆహారాన్ని పరిశీలించారు. నాణ్యమైన భోజనం అందించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. జాతీయ డీవార్మింగ్ డే సందర్భంగా విద్యార్థులకు ఆరోగ్యం, పరిశుభ్రత, ఆల్బెండజోల్ వినియోగంపై అవగాహన కల్పించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో వివిధ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, బాలల సంరక్షణ గృహాల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. బాలల రక్షణకు సమష్టిగా కృషి చేయాలని, ప్రతి మూడు నెలలకు సమీక్ష సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం బాపట్ల పబ్లిక్ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. ప్రతిరోజూ క్రీడల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల యాజమాన్యానికి సూచించారు. బాలల హక్కులకు భంగం కలిగించే చర్యలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

## ప్యాపిలిలో కొనసాగుతున్న వీఆర్ఏల నిరసన

**11వ రోజుకు చేరిన సహాయ నిరాకరణ ఆందోళన**



**ప్రజా జ్యోతి న్యూస్ సెప్టెంబర్ 25** ప్యాపిలి తహశీల్దార్ కార్యాలయం వద్ద గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏలు) చేపట్టిన సహాయ నిరాకరణ ఆందోళన శనివారం 11వ రోజుకు చేరుకుంది. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ వీఆర్ఏలు నిరసన కొనసాగిస్తున్నారు. 11 రోజులుగా ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి తమ సమస్యల పరిష్కారంపై స్పష్టమైన స్పందన రాకపోవడంతో వీఆర్ఏలు ఆవేదన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, అయినప్పటికీ సమస్యలకు పరిష్కారం లభించలేదని తెలిపారు. గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థకు సంబంధించిన వివిధ సేవల్లో విధులు నిర్వహిస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వీఆర్ఏలతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు సహాయ నిరాకరణ ఆందోళనను కొనసాగిస్తామని వీఆర్ఏలు స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు.

## ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చెయ్యటానికే సోషల్ మీడియాఇన్ ఫ్లూయ యర్స్.

**పోడూరు. ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. సెప్టెంబర్ 26.** ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చెయ్యటానికే సోషల్ మీడియాఇన్ ఫ్లూయ యర్స్ పేరుతో ప్రభుత్వం తెరలేపుతున్నదని వైయస్ఆర్సీపీ మహిళా నాయకురాలు మాజీ జెడ్పిటిసి కర్రీ గౌరీ సుభాషిని శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. టిడిపి పార్టీ కార్యకర్తలకు లబ్ధి చేకూర్చటానికి పార్టీ బలోపేతానికి సోషల్ మీడియాఇన్ ఫ్లూయ యర్స్ ను వినియోగించుకోవటానికి ప్రభుత్వం చూస్తున్నదన్నారు. ఎన్నికల్లో. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను పక్కనపెట్టి బూటక ప్రచారాలు చేసుకుంటున్న కూటమి ప్రభుత్వం తమ పార్టీ జాగీర్లకు ఆర్థికంగా



తోడ్పాటునందించేందుకు ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం పాల్పడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మహిళలు, రైతులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

# తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పేడాడ రామ్మోహన్ రావు పర్యటన

**- ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడిన ఏ .ఎం.సి చైర్మన్**





**ఆమదాలవలస,ప్రజాజ్యోతి న్యూస్:** ఆర్నాబ్ తుఫాన్ ప్రభావంతో ఆమదాలవలస నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ముంపునకు గురైన పంట పొలాలను ఆమదాలవలస వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏ.ఎం.సి ) చైర్మన్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ పేడాడ రామ్మోహన్ రావు శనివారం పర్యటించి పరిశీలించారు. బూర్జ మండలంలోని అల్లెన, జిబి పురం గ్రామాల్లో, ఆమదాలవలస మండలంలోని చీమలవలస ప్రాంతంలో ముంపునకు గురైన పంట పొలాలను ఆయన పరిశీలించారు. అలాగే సరుబుజ్జిలి మండలంలోని తెలికపెంట, పాతపాడు, సుబ్బపేట, సింధువాడ ప్రాంతాల్లో నీట మునిగిన పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులను నేరుగా కలిసి పంటల పరిస్థితి, నష్టం తీవ్రత, సాగు కోసం చేసిన ఖర్చులు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. భారీ వర్షాలు, వరదల కారణంగా పంటలు నీట మునిగి తీవ్రంగా నష్టపోయామని రైతులు రామ్మోహన్ రావు దృష్టికి తీసుకువచ్చారు.రైతుల పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్ట వివరాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం ద్వారా తగిన సహాయం అందేలా కృషి చేస్తామని పేడాడ రామ్మోహన్ రావు రైతులకు భరోసా ఇచ్చారు. పంట నష్టంపై సమగ్రంగా అంచనా వేసి, అర్హులైన రైతులకు ప్రభుత్వ పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు రైతులకు అండగా నిలిచి, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కోరుకొండ మల్లేశ్వరరావు, అంపిలి విక్రమ్, పైడి మురళీమోహన్, పొగిరి ఆనంద్, తులగాపు ధనుంజయ్, ఊటపల్లి అప్పారావు, బగ్గు అప్పలరాజు, బి ఎ నాయుడు, అనుసూరి మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు శ్రీకారం పలు మౌలిక వసతులను ప్రారంభించిన ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి





**నందవరం, సెప్టెంబర్ 26(ప్రజా జ్యోతి ):**మండల కేంద్రంలో విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు, మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన పలు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి పాల్గొని ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ కార్యాలయం వద్దర్ బి శాఖ ఆధ్వర్యంలో ఎస్ హెచ్ నిధులతో రూ.2.50 కోట్ల వ్యయంతో 8 కిలోమీటర్ల బీటీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు.అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఎన్టీఆర్ సుజల స్రవంతి నీటి సరఫరా కేంద్రం, బస్‌స్టాండ్ వద్ద స్వర్ణ సచివాలయం, బీసీ కాలనీ కిందగేరి సీసీ రోడ్డు ప్రారంభించారు. ప్రజల సాధారణ అవసరాల కోసం ఏర్పాటు చేసిన బోర్‌వెల్ నీటి సౌకర్యాన్ని కూడా ప్రారంభించారు. అనంతరం లింగాయత్ గేరిలో (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ – విలేజ్ హెల్త్ క్లినిక్) ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, నందవరం మండలంలో రహదారులు, తాగునీరు, సాగునీరు, వైద్యం, విద్య వంటి మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడమే లక్ష్యమని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలతో పాటు అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను కల్పిస్తూ నందవరం మండలాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పీఏసీఎస్ అధ్యక్షులు గోపాల్, టీడీపీ మండల అధ్యక్షులు కాసిం వలి, మండల నాయకులు, మజీ మార్కెట్ చైర్మన్ దేశాయ్ మాధవరావు, ఈరన్న గౌడ్, రైస్ మిల్ నారాయణరెడ్డి, కనకవిడి రగుమూర్తి స్వామి, గ్రామ కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీని బలోపేతం చేయాలి

**స్క్రాప్‌కు పంపిన బస్సుల స్థానంలో కొత్త బస్సులు కొనుగోలు చేయాలి**

**ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి ఆర్టీసీ బస్టాండ్లు, ఆస్తులను ప్రైవేటీకరించరాదు**

**-- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ**




**మదనపల్లి సెప్టెంబర్ 26 ప్రజా జ్యోతి** ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసి, ఆర్టీసీని ప్రజల రవాణా సంస్థగా పరిరక్షించాలని ఏఐటీయూసీ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈరోజు జరిగిన ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా సమితి సమావేశంలో ఆయన ఆహ్వానితులుగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఆర్టీసీలో కాలం చెల్లిన బస్సులను స్క్రాప్‌కు పంపుతున్న నేపథ్యంలో, వాటి స్థానంలో కొత్త బస్సులను తక్షణమే కొనుగోలు చేసి ప్రజలకు మెరుగైన, సురక్షితమైన రవాణా సౌకర్యం కల్పించాలని సాంబశివ డిమాండ్ చేశారు. బస్సుల కొరత కారణంగా ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా అవసరానికి అనుగుణంగా ఆర్టీసీ ఫ్లీట్‌ను పెంచాలన్నారు. ఆర్టీసీకి చెందిన బస్టాండ్లు, డిపోలు, ఇతర విలువైన ఆస్తులను ప్రైవేటీకరణ చేయరాదని స్పష్టం చేశారు. ప్రజల అవసరాల కోసం నిర్మించబడిన ప్రజా రవాణా ఆస్తులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం వల్ల ప్రయాణికులు, ఉద్యోగులు నష్టపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు.ఏళ్ల తరబడి ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.ఆర్టీసీ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించడంతో పాటు వేతనాలు, పదోన్నతులు, సర్వీస్ సమస్యలు, ఉద్యోగ భద్రత, సంక్షేమానికి సంబంధించిన అంశాలపై ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం చర్చించి పరిష్కారం చూపాలని కోరారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలంటే ఆర్టీసీని బలోపేతం చేయడంతో పాటు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడం అత్యంత అవసరమని సాంబశివ పేర్కొన్నారు. ప్రజా రవాణా వ్యవస్థ పరిరక్షణకు, ఆర్టీసీ ఉద్యోగుల హక్కుల కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు.

# రంగసముద్రం జగనన్న లేఅవుట్‌లో అక్రమ కట్టడాలు?

**-- నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతోందంటూ ఆవేదన**

**-- సమగ్ర విచారణ జరిపించాలని స్థానికుల డిమాండ్**



**పోరుమామిళ్ల, సెప్టెంబరు 26(ప్రజా జ్యోతి ప్రతినిధి)** వైఎస్సార్ జిల్లా పోరుమామిళ్ల మండలం రంగసముద్రం గ్రామ సచివాలయ పరిధిలోని జగనన్న లేఅవుట్‌లో అక్రమ కట్టడాలు జరుగుతున్నాయంటూ స్థానికుల నుంచి తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.రంగసముద్రం సర్వే నంబర్ 1263 పరిధిలో నిరుపేదల ఇళ్ల నిర్మాణాల కోసం ప్రభుత్వం ఒక్కొక్కరికి ఒకటిన్నర సెంటు చొప్పున ప్లాట్లను కేటాయించింది. గతంలో ఆన్‌లైన్‌లో నమోదైన అర్హులైన లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ కార్యాలయం ద్వారా అధికారికంగా ప్లాట్ నంబర్లు కూడా కేటాయించారు. అయితే సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం, పర్యవేక్షణా లోపం కారణంగా తమకు కేటాయించిన స్థలాలు దక్కకుండా పోతున్నాయని, అర్హులైన పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం ఈ లేఅవుట్‌లోని 82 నుంచి 90 వరకు ఉన్న ప్లాట్లలో కొందరు నిబంధనలకు విరుద్ధంగా, అక్రమంగా బేస్‌మెంట్ నిర్మాణాలు చేపడుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల సంచర్ల పంచాయతీ పరిధిలోని రామేశ్వరం జగనన్న లేఅవుట్‌లోనూ ఇదే తరహా అక్రమ నిర్మాణాలపై వివాదాలు, ఆరోపణలు వెలుగు చూశాయని గుర్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు తక్షణమే స్పందించి రంగసముద్రం జగనన్న లేఅవుట్‌పై సమగ్ర విచారణ జరిపించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆక్రమణలను అడ్డుకుని, విచారణ ద్వారా నిజమైన లబ్ధిదారులను గుర్తించి వారికి తగిన న్యాయం చేయాలని స్థానిక ప్రజలు, పేదలు డిమాండ్ చేస్తున్నారు.

## అక్టోబర్ 1న మధ్యాహ్నం నుంచి పెన్షన్ల పంపిణీ



**బాపట్ల, సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతిజిల్లా ప్రతినిధి)** బ్యాంకులకు వరుసగా మూడు రోజుల సెలవులు ఉన్న నేపథ్యంలో అక్టోబర్ 1న ఉదయం పెన్షన్ మొత్తం జమ అయిన అనంతరం మధ్యాహ్నం నుంచి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ చేపట్టనున్నట్లు మున్సిపల్ ఇంచార్జి కమిషనర్ కృష్ణారెడ్డి తెలిపారు.ఈ నెల 28, 29, 30 తేదీల్లో బ్యాంకులకు సెలవులు ఉన్నందున పెన్షన్ల పంపిణీ సమయాన్ని మార్చినట్లు ఆయన పేర్కొన్నారు. అక్టోబర్ 1న ఉదయం పెన్షన్ మొత్తం బ్యాంకుల్లో జమ అయిన వెంటనే మధ్యాహ్నం నుంచి పంపిణీ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు.బాపట్ల పురపాలక సంఘ పరిధిలోని పెన్షన్‌దారులు ఈ విషయాన్ని గమనించి, పెన్షన్ల పంపిణీలో సిబ్బందికి సహకరించాలని ఇంచార్జి కమిషనర్ కృష్ణారెడ్డి కోరారు.

## తుఫాన్ ప్రభావిత వరి పంటల పరిశీలన

**– నాగావళి, రెల్లిగడ్డ పరివాహక ప్రాంతాల్లో పంట నష్టంపై క్షేత్రస్థాయి పరిశీలించిన ఏ.డి శ్రీనివాస రావు**



**పొందూరు ,ప్రజాజ్యోతి న్యూస్:** ఇటీవల జిల్లాను తాకిన తుఫాన్ కారణంగా పొందూరు మండలంలోని నాగావళి నది, రెల్లిగడ్డ పరివాహక ప్రాంతాల్లో నీట మునిగిన వరి పంటలను రణస్థలం సహాయ వ్యవసాయ సంచాలకులు వి. శ్రీనివాసరావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు మొదలవలస, బొడ్డేపల్లి, తాడివలస, గోరింట, గోకర్ణపల్లి గ్రామాల్లో పర్యటించి వరద ప్రభావంతో నీట మునిగిన వరి పొలాలను పరిశీలించారు.ఈ సందర్భంగా పొలాల్లో నిలిచిన నీటి పరిస్థితి, వరి పంటపై వరద ప్రభావం, పంట నష్టం తీవ్రతను ఆయన పరిశీలించారు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని సమగ్రంగా పరిశీలించి, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నష్టం వివరాలను నమోదు చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.పంటలకు యూరియా, ఎం.ఓ.పి పైపాటు తుఫాన్ ప్రభావం తగ్గి, పంట పొలాల్లో వరద నీరు తగ్గిన అనంతరం వరి చేనుకు 10 నుంచి 25 కిలోల యూరియా, 25 కిలోల ఎం.ఓ.పి పైపాటుగా వేయాలని రైతులకు సూచించారు. పంటకు తెగుళ్లు, పురుగులు సోకినట్లయితే వెంటనే గ్రామ వ్యవసాయ సహాయకులు లేదా మండల వ్యవసాయాధికారిని సంప్రదించాలని తెలిపారు.ఈ పరిశీలనలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస బాబు, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## సీపీఐ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలను విజయవంతం చేయండి

**సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్ధిగాళ్ల శ్రీనివాసులు**



**రాయచోటి, సెప్టెంబర్ 26 ప్రజా జ్యోతి** సెప్టెంబర్ 28న కడపలో నిర్వహించనున్న సీపీఐ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలను విజయవంతం చేయాలని సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్ధిగాళ్ల శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం రాయచోటిలో పార్టీ కార్యకర్తలతో కలిసి ప్లీనరీ సమావేశాల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిద్ధిగాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద, కార్పొరేట్ అనుకూల, నిరంకుశ విధానాలను ప్రతిఘటిస్తూ, సమగ్ర సామాజిక న్యాయం సాధన కోసం ఈ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సమావేశాలకు ముఖ్య అతిథులుగా సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ డి. రాజా, జాతీయ కార్యదర్శు లు కె. రామకృష్ణ, పల్లా వెంకటరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య తదితరులు హాజరుకానున్నారని వెల్లడించారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై భవిష్యత్తులో చేపట్టాల్సిన ప్రజా పోరాటాలకు ఈ ప్లీనరీ సమావేశాలు దిశానిర్దేశం చేస్తాయని పేర్కొన్నారు. కావున సీపీఐ కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు, పార్టీ సానుభూతిపరులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రాష్ట్ర ప్లీనరీ సమావేశాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీపీఐ నాయకులు రామ్మోహన్, మస్తాన్, నరసింహులు, శివ తదితరులు పాల్గొన్నారు.

## యువత స్వశక్తితో ఎదగాలి.-

**--సల్ల నాగరాజు**



**చాగలమర్రి , సెప్టెంబర్ 26 ( ప్రజాజ్యోతి న్యూస్) ;** చాగలమర్రిటోల్ ప్లాజా సమీపంలో ఉత్తేజిత గోడాన్ పక్కన శెట్టివీడు గ్రామంకు చెందిన అశోక్ అనే యువకుడు ఏర్పాటు కున్న వ్యాపార సముదాయాన్ని తెలుగుదేశం పార్టీ నంద్యాల పార్లమెంట్ స్పోక్ పర్సన్ సల్లా నాగరాజు, ప్రారంభించడం జరిగింది. యువత స్వశక్తితో ఎదిగి కుటుంబానికి అండగా నిలుస్తూ, సమాజ శ్రేయస్సు కోసం కూడా పాటుపడాలని ఆకాంక్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిఎన్టియుసి రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహుడు బీసీ సంఘం నాయకులు టైలర్ భాష, పీరయ్య, మైనారిటీ నాయకులు సయ్యద్ బషీర్, మాజీ వార్డు సభ్యులు సుబ్బారావు, బాల దస్తగిరి, ఆళ్లగడ్డ టిడిపి ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు కసినేని ఓబులేసు, నాగార్జున, ఫారుక్, కలాం బీడి బషీర్, సురేంద్ర మోహన్ కృష్ణ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్న పేద,మధ్య తరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి కొండంతా అండ

**సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ కార్యక్రమంలో మంత్రాలయం తెదేపా ఇన్చార్జి ఎన్. రాఘవేంద్ర రెడ్డి**

**పేదల చిరునవ్వే మా ప్రభుత్వానికి అసలైన విజయం...కౌతాళం మండలం అధ్యక్షులు చూడి సురేష్ నాయుడు**









**కౌతాళం, సెప్టెంబర్ 26 ప్రజా జ్యోతి** శనివారం రోజున మంత్రాలయం నియోజకవర్గం మాధవరం తెదేపా కార్యాలయం నందు నియోజక వర్గ ప్రజలు అనారోగ్యముతో ఇబ్బందులు పడుతూ 20వ విడతగా సీఎం సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకున్న నాలుగు మండలాల 135 మంది లబ్ధిదారులకు రూ”51,21,316 విలువైన చెక్కలను లబ్ధిదారులకు అందచేస్తూ,వచ్చిన ప్రతి ఒక్కరికి అండగా బరోసానిస్తూ భోజన వసతి కల్పిస్తూ,సీఎం సహాయ నిధి సరిగా ఉపయోగించుకునే తెలియని వారు ఉంటే ప్రస్తుత లబ్ధిదారులు వారికి తెలియజేయ్యలని, కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు.ఈ కార్యక్రమములో నాలుగు మండలాల అధ్యక్షులు పల్లెపాడు రామిరెడ్డి,గోపాల్ రెడ్డి,సురేష్ నాయుడు,మల్లికార్జున మరియు మాజీ అధ్యక్షులు ముత్తురెడ్డి, జ్ఞానేశ్,సింగిల్ విండో అధ్యక్షులు వెంకటపతిరాజు, అయ్యన్న తెలుగు యువత రాకేష్ రెడ్డి,హరివిలి వీరేష్, మాలపల్లి లక్ష్మయ్య,వెంకటేష్, ఉరుకుంద మహాదేవ నాయుడు, తిప్పలదొడ్డి మల్లయ్య, చుడి సురేష్ మొదలగు కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగినది

# రాష్ట్రంలోని అన్నిజిల్లాల్లో కరువు పరిస్థితులపై సమగ్ర పరిశీలన చేయాలి

**ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అన్నమయ్యజిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమల్ల రంగారెడ్డి.**



**రాయచోటి సెప్టెంబర్ 26 ప్రజా జ్యోతి** రాష్ట్రంలోని కోస్తా ప్రాంతంలో కొన్ని జిల్లాల్లో ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా వరద పరిస్థితులు ఏర్పడ్డాయని, పంటలకు నష్టం వాటిల్లిందని వార్తలు వస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ళ రంగారెడ్డి తెలిపారు.అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో రంగారెడ్డి తన సహచరులతో కలిసి మాట్లాడుతూ రెండు, మూడు జిల్లాల్లో వర్షాలు కురిసినంత మాత్రాన రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో కరువు పరిస్థితులు లేవని ప్రభుత్వం భావించకూడదని స్పష్టంచేశారు.రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికీ వర్షాభావ పరిస్థితులు నెలకొని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రంగారెడ్డి పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కరువు పరిస్థితులపై సమగ్రంగా పరిశీలన చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి జిల్లాలో ప్రత్యేక కరువు బృందాలను ఏర్పాటుచేసి క్షేత్రస్థాయిలో పర్యటింపజేయాలని, ఆయా ప్రాంతాల్లో పంటల పరిస్థితి, వర్షపాతం, పంట నష్టం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అంచనా వేయాలని కోరారు.రైతులకు జరిగిన పంటనష్టాన్ని సమగ్రంగా అంచనా వేసి, నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు.రాష్ట్ర రైతు సంఘం ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా రాయచోటి ఆర్ డి ఒ కు కరువు పరిస్థితులపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నెలకొన్న వాస్తవ పరిస్థితులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని రైతులకు అండగా నిలవాలని కోరారు.ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా రామాపురం మండల రైతు సంఘం అధ్యక్షుడు నవీన్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి షబ్బీర్‌భాష, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రత, ఆరోగ్యం, మంచి అలవాట్లపై విద్యార్థులకు అవగాహన





**రాయచోటి, సెప్టెంబర్ 26 ప్రజా జ్యోతి** రాయచోటిలోని ఎస్వీ విద్యా మందిర్ హై స్కూల్లో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, క్రమశిక్షణపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డా. ఎం. సుధాకర్ రెడ్డి, మాట్లాడుతూ, “పరిశుభ్రమైన పరిసరాలు మంచి ఆలోచనలకు, మంచి అలవాట్లు మంచి భవిష్యత్తుకు పునాది వేస్తాయి” అని అన్నారు.విద్యార్థులు పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, చెత్తను చెత్తబుట్టల్లో వేయాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, మొక్కలను సంరక్షించాలని, నీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, తగినంత నీరు తాగడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, క్రీడల్లో పాల్గొనడం, సమయపాలన పాటించడం వంటి మంచి అలవాట్లను అలవర్చుకోవాలని తెలిపారు.అలాగే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవించడం, మర్యాదగా మాట్లాడటం, ఇతరులతో సహకారభావంతో మెలగడం, మొబైల్ ఫోన్‌ను బాధ్యతాయుతంగా వినియోగించడం వంటి విలువలను పాటించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో పరిశుభ్రత, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, క్రమశిక్షణపై ప్రతిజ్ఞ చేయించారు.“మార్పును మీతోనే ప్రారంభించండి” అని డా. ఎం. సుధాకర్ రెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు.

## తెలుగు వేమన శతక, సుమతి శతక పోటీల కార్యక్రమం ....



**చాగలమర్రి , సెప్టెంబర్ 26 ( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** చాగలమర్రి లోని శ్రీ చైతన్య భారతి ఉన్నత పాఠశాల నందు శనివారం నాడు ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి పిల్లలకు వేమన శతక మరియు సుమతి శతక పద్యాల పోటీలను నిర్వహించడం జరిగింది. తెలుగు సంస్కృతి సాంప్రదాయాలను ఆచార వ్యవహారాలను పిల్లలకు తెలియజేసే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ప్రభుత్వం వారు నిర్వహించే నో బ్యాగ్ డే సందర్భంగా శనివారం ఈ పోటీలను నిర్వహించినట్లు పాఠశాల మేనేజ్మెంట్ ప్రధానోపాధ్యయులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మల్లికార్జునరావు, ఏఓ చంద్రకళ, ప్రిన్సిపాల్ చంద్రమౌళి, ఇన్చార్జి శారద, ప్రధానోపాధ్యాయులు రఫీ, బాలయ్య, తెలుగు ఉపాధ్యాయురాలు శారద సీనియర్ ఉపాధ్యాయులు రసూల్, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

## కానగూడూరు లో...ఘనంగా అంగన్‌వాడీ ఉత్సవ వేడుకలు





**దువ్వూరు, సెప్టెంబర్ 26 ( ప్రజా జ్యోతి )** మండల పరిధిలోని కానగూడూరు అంగన్వాడీ కేంద్రంలో శనివారం అంగన్వాడీ ఉత్సవాలు నిర్వహించారు.కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానూసారం సెప్టెంబర్ 25 తేదీ నుండి అక్టోబరు 7వరకు గౌరవనియ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారి 25 సంవత్సరాల ప్రజా సేవ సంకల్ప అభియాన్ లో భాగంగా రాష్ట్రము లో అన్ని అంగన్వాడీ కేంద్రం లో మూడు రోజుల పాటు మహిళా భివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ మరియు వైద్య ఆరోగ్యశాఖ సంయూక్తంగా ప్రతి అంగన్వాడీ కేంద్రంలో తొమ్మిదవ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమం తో కలిపి నిర్వహించారు.ఈ ఉత్సవాలు ద్వారా అంగన్వాడీ కేంద్రం లో అందరికి పోషణ మాతృ సంరక్షణ టీకాలు సామాజిక సేవలను సంబంధించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వా పథకాలు మరియి వివిధ సేవల గురించి లబ్ధిదారులు కు వివరించి వారి నుండి నిజమైన అనుభవాల రూపం లో వారి అభిప్రాయలు స్వీకరించడం ప్రభుత్వము నుండి వస్తున్న పథకాల గురించి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరికృష్ణ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర జిల్లా స్థాయిలో అంగన్వాడీ సేవలు విస్తరణ పోషణ ట్రాకర్ లో నమోదు ప్రధానమంత్రి మాతృ వందన యోజన భేటీ బచావో భేటీ పడవో. ప్రసూతి సమయం లో అందించే నగదు బదిలీ అనేక పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు,ఆశా వర్కర్లు గర్భితులు,బాలింతలు మరియు బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రతాప్,రామ ముని రెడ్డి,బిజెపి మండల అధ్యక్షుడు శ్రీనివాసులు నాగరాజు, నరేంద్ర పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

--- ఎంఈఓ శేష శయన రెడ్డి





**చాగలమర్రి , సెప్టెంబర్ 26 ( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలని మండల విద్యాశాఖ అధికారి శేషశయనారెడ్డి సూచించారు. చాగలమర్రి మండలం పెద్దభోధనం గ్రామంలోని జడ్పీ హైస్కూల్లో శనివారం జరిగిన క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశంలో అయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నూతన విద్యా బోధన ప్రమాణాలను అందిపుచ్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా డిజిటల్ విద్యా బోధన పద్ధతులను గురించి ఆయన వివరించారు. ఈ సమావేశంలో కాంప్లెక్స్ హెచ్.ఎం వరలక్ష్మి,ఆర్పి శివ శంకర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,